జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాపాలన
NEWS IS RIGHT
Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*
https://prajapalana.com/epaper.php




సంపుటి 15 సంచిక 99 విశాఖపట్నం శుక్రవారం 16 డిసెంబరు 2022 8 పేజీలు వెల: 5.00

## గుజరాత్ బీజేపీ యూనిట్‌పై...
# మోడీ ప్రశంసలు

ఢిల్లీ: గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గత రికార్డులను తిరగరాసింది.. భారతీయ జనతా పార్టీ వరుసగా ఏడోసారి గుజరాత్‌లో అధికారాన్ని సొంతం చేసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వ్యూహాలతో.. చారిత్రక విజయాన్ని సొంతం చేసుకుంది. గుజరాత్‌లోని 182 అసెంబ్లీ స్థానాలకు బీజేపీ రికార్డు స్థాయిలో 156 స్థానాలను కైవసం చేసుకుంది. కాంగ్రెస్ 17, ఆప్ 5 స్థానాలకే పరిమితం అయ్యాయి. కాగా.. గుజరాత్ ఎన్నికల్లో బీజేపీ గత రికార్డులన్నీ బద్దలు కొట్టడంపై ప్రధాని మోడీకి అభినందనలు వెల్లువెత్తాయి. బీజేపీ అధిష్టానం సైతం ఈ విజయం ప్రధాని మోడీకే దక్కుతుందని పేర్కొంది. ఢిల్లీలో బుధవారం జరిగిన బీజేపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో గుజరాత్ విజయాన్ని ప్రస్తావిస్తూ పలువురు నేతలు ప్రధాని నరేంద్ర మోడీని



అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర యూనిట్‌పై, ముఖ్యంగా అధ్యక్షుడు సి ఆర్ పాటిల్‌పై ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు. ఈ విజయం బీజేపీ సంస్థాగత బలమని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి సమావేశం అనంతరం విలేకరులతో పేర్కొన్నారు. ముఖ్యంగా కార్యకర్తల విజయమంటూ పేర్కొన్నారు.. పార్టీ కార్యకర్తలకు రుణపడి ఉందని పేర్కొన్నారు.పార్టీ సంస్థ పటిష్టంగా ఉంటే ఎన్నికలలో విజయం ఎలా సాధ్యమో చెప్పేందుకు గుజరాత్ లోని బీజేపీ యూనిట్‌ను పీఎం మోడీ ఒక ఉదాహరణగా కొనియాడారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. బూత్ లెవల్‌లో పార్టీని బలోపేతం చేయడం.. ప్రజల్లో పథకాల గురించి వివరించడం.. ఓట్లను పార్టీకి మలుచుకోవడం లాంటి విషయాలను ప్రధాని మోడీ ప్రస్తావించారు. 182 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికలలో 156 స్థానాల్లో విజయం సాధించిన తరువాత.. తన సన్నిహితుడైన పాటిల్‌ను ప్రధాని ప్రశంసించడం, పార్టీలో అతని స్థానాన్ని తెలియజేస్తుందని పేర్కొన్నాయి. కాగా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాపై కూడా మోదీ ఈ సందర్భంగా ప్రశంసలు కురిపించారు.పాటిల్ 2019లో నవ్‌సారి లోక్‌సభ స్థానం నుంచి దాదాపు ఏడు లక్షల ఓట్ల తేడాతో సొంతంగా గెలుపొందడం అప్పట్లో రికార్డుగా ఉంది. దీని వెనుక బూత్ స్థాయి నుంచి చివరి స్థాయి కార్యకర్తలు, వారి ఇళ్ల వరకు పార్టీని బలోపేతం చేసి.. పాటిల్ తనదైన ప్రణాళికతో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారు.

# గంటా, కన్నా, బోండా భేటీ..
## త్వరలోనే సంచలన ప్రకటన ఉంటుందా..?



విజయవాడ: గంటా, కన్నా, బోండా. వీరి పార్టీలు వేరు. కానీ వీరిలో కామన్ పాయింట్ కాపు సామాజికవర్గం. వీరు ముగ్గురు అర్ధరాత్రి వరకు చర్చలు జరపడమే ఇప్పుడు ఏపీలో పొలిటికల్ అటెన్షన్‌ను క్రియేట్ చేస్తోంది. పైగా వీరి భేటీకి ముందు కన్నా లక్ష్మీనారాయణను జనసేన కీలక నేత నాదెండ్ల మనోహర్ కలవడం మరింత ఆసక్తిగా మారింది. బీజేపీ నేత కన్నా, టీడీపీలో ఉన్న గంటా, బోండా ఉమ బుధవారం విజయవాడలో కలిశారు. అర్ధరాత్రి వరకు చర్చలు జరిపారు. గతంలో ఎప్పుడూ కలవని వీరు చర్చలు జరపడం ఆసక్తిగా మారింది. ఈ నెల 26న రంగా వర్ధంతి రోజున విశాఖలో కాపు నాడు మహాసభ ఉంది. ఆ రోజు వివిధ పార్టీల్లోని కాపు నేతలంతా కీలక ప్రకటన చేస్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో విజయవాడలో కన్నా, గంటా, బోండా భేటీ రాజకీయ ప్రాధాన్యతను పెంచేస్తోంది.వీరంతా కలిసి ఒకే జెండా కప్పుకుంటారా? లేదంటే కొత్త జెండాను ప్రకటిస్తారా? అనేది ఆసక్తిగా మారింది. అదీ కాక గంటా, కన్నాను కలవడానికి ముందు జనసేన నేత నాదెండ్ల మనోహర్ లక్ష్మీనారాయణను కలవడం, సుదీర్ఘంగా చర్చలు జరపడం ఆసక్తిగా మారింది. ఇటీవల కాపు సీఎం నినాదాన్ని వినిపిస్తున్నారు కొందరు నేతలు. ఈ నేపథ్యంలోనే జరుగుతున్న పరిణామాలు కీలకంగా మారాయి. కాపు నేతను సీఎం అభ్యర్థిగా ప్రకటించే వారికే తమ మద్దతు ఉంటుందనే ప్రకటన చేయాలనే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.కానీ తమ భేటీకి రాజకీయ ప్రాధాన్యత లేదని చెప్పారు గంటా శ్రీనివాసరావు. తమ భేటీలో రంగా వర్ధంతి కార్యక్రమం చర్చకే రాలేదన్నారు బోండా ఉమ. రాజకీయ చర్చే జరగలేదన్నారు. బుధవారం రాత్రి కన్నా కూడా ఇదే చెప్పారు. కేవలం డిన్నర్ కోసమే మీటింగ్ అయ్యామని చెప్పుకొచ్చారు. ఏమో లోగుట్టు పెరుమాళ్ళకెరుక.



## మహిళా శిశు సంక్షేమ శాఖపై జగన్ సమీక్ష

అమరావతి: తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా శిశు సంక్షేమశాఖపై సమీక్ష చేపట్టారు. ఈ సమావేశానికి మహిళ శిశు సంక్షేమశాఖ మంత్రి కె ఉషశ్రీచరణ్, సీఎస్ కె ఎస్ జవహర్ రెడ్డి, మహిళ శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, పాఠశాల విద్యాశాఖ (మౌలిక సదుపాయాలు) కమిషనర్ కాటమనేని భాస్కర్, మహిళ శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ డాక్టర్ ఎ సిరి, పౌరసరఫరాలశాఖ ఎండీ జి వీరపాండియన్, మార్క్‌ఫెడ్ ఎండీ రాహుల్ పాండే ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# కల్తీ మద్యం మృతుల సంఖ్య 39..
## తాగితే చనిపోతారన్న సీఎం నితీశ్



పాట్నా: బీహార్‌లో కల్తీ మద్యం తాగిన కేసులో మృతిచెందిన వారి సంఖ్య 39కి చేరుకున్నది. శరన్ జిల్లాలోని చాప్రా ప్రాంతంలో జరిగిన ఘటనలో మృతుల సంఖ్య పెరుగుతోంది. దీనిపై ఆ రాష్ట్ర సీఎం నితీశ్ కుమార్ స్పందించారు. కల్తీ మద్యం సేవిస్తే, ప్రాణాలు కోల్పోతారని ఆయన అన్నారు. చాప్రా విషాదంపై ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మద్య నిషేధం లేని రోజుల్లో కూడా ఇక్కడ కల్తీ మద్యం తాగి జనం చనిపోయినట్లు సీఎం తెలిపారు. ఇతర రాష్ట్రాల్లోనూ ఇలాంటి ఘటనలు జరిగాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇక్కడ లిక్కర్ బ్యాన్ ఉందని, కల్తీ మద్యాన్ని అమ్ముతారని, దాని వల్ల ప్రజలు చనిపోతారని, మద్యం మంచిది కాదని, ఎవరూ తాగకూడదని సీఎం నితీశ్ అన్నారు.కల్తీ మద్యం తాగి మృతిచెందిన వారికి నష్టపరిహారం ఇవ్వాలని గతంలో కొందరు డిమాండ్ చేశారని, ఎవరైనా మద్యం సేవిస్తే ప్రాణాలు కోల్పోవడం తప్పదని, మన కళ్ల ముందే ఇవన్నీ కనిపిస్తున్నాయని, ఇలాంటి ఘటనలు విషాదాన్ని మిగిల్చుతాయని, ఆ ప్రాంతాలను విజిట్ చేసి, వారికి కల్తీ మద్యం గురించి వివరించాలని సీఎం నితీశ్ తెలిపారు. పేదలను అరెస్టు చేయవద్దు అని అధికారుల్ని ఆదేశించానని, కానీ లిక్కర్‌ను తయారు చేసేవాళ్లను, ఆ వ్యాపారాన్ని నిర్వహించేవాళ్లను పట్టుకోవాలని ఆదేశించినట్లు సీఎం నితీశ్ తెలిపారు. మద్య నిషేధం వల్ల చాలా మంది ప్రజలు బెనిఫిట్ పొందారని, ఎంతో మంది మద్యాన్ని త్యజించారని, ఇది మంచి పరిణామం అని, అనేక మంది మద్య నిషేధ నిర్ణయాన్ని స్వాగతించారని, కానీ కొందరు ఎప్పుడూ సమస్యలు సృష్టిస్తుంటారని, అలాంటి వాళ్లను పట్టుకోమని అధికారులకు ఆదేశించినట్లు సీఎం నితీశ్ తెలిపారు.

## భారత్ అమ్ముల పొదిలో మరో అస్త్రం..
# 'అగ్ని వి' మిస్సైల్ లాంచ్ సక్సెస్



నెల్లూరు: భారత్ అమ్ముల పొదిలో మరో అద్భుదమైన అస్త్రం చేరింది. 5వేల కిలోమీటర్ల పరిధిలో ఉన్న టార్గెట్?ని అయినా కచ్చితంగా కొట్టేయగల అణు సామర్థ్యం గల మిస్సైల్ (అగ్ని వి)?ని ఇండియా ఇవ్వాల ప్రయోగించింది. గురువారం రాత్రి జరిపిని ఈ పరీక్ష సక్సెస్? అయినట్టు భారత రక్షణ వర్గాలు వెల్లడించాయి. అయితే.. అణ్వాయుధ సామర్థ్యం గల అగ్ని వి బాలిస్టిక్? క్షిపణిని మరింత శక్తివంతంగా తయారు చేయనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి.అయితే.. ఇది మునుపటి కంటే ఇప్పుడు తేలికైన క్షిపణిలో కొత్త టెక్నాలజీని యాడ్? చేసినట్టు రక్షణ వర్గాలు తెలిపాయి. అవసరమైతే అగ్ని వి క్షిపణి పరిధిని పెంచే సామర్థ్యాన్ని ఈ ట్రయల్ నిరూపించిందని రక్షణ వర్గాలుతెలిపాయి.




# అటల్ టన్నెల్ పేరు మార్చబోం..
## మాజీ ప్రధానిని గౌరవిస్తాం: హిమాచల్ ప్రదేశ్ సీఎం




సిమ్లా: బీజేపీ మాదిరిగా సంస్థలు, ప్రాజెక్టుల పేర్లను తాము మార్చబోమని హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్‌విందర్ సింగ్ సుఖు తెలిపారు. రోహ్‌తంగ్ పాస్ కింద నిర్మించిన అటల్ టన్నెల్ పేరును తమ ప్రభుత్వం మార్చబోదని స్పష్టం చేశారు. అయితే అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మార్చుతామని ఆయన వెల్లడించారు. 2010 జూన్‌లో కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ ఈ టన్నెల్ నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన సంగతిని గుర్తు చేశారు. అయితే 2020 అక్టోబర్‌లో అటల్ టన్నెల్‌ను ప్రధాని మోదీ ప్రారంభించిన సందర్భంగా నాటి శిలాఫలకాన్ని బీజేపీ ప్రభుత్వం తొలగించిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో అటల్ టన్నెల్ వద్ద కొత్తగా శిలాఫలకాన్ని ఏర్పాటు చేస్తామని హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్‌విందర్ సింగ్ తెలిపారు. నాడు శంకుస్థాపన చేసిన సోనియా గాంధీ పేరును కొత్త శిలాఫలకంలో చేర్చుతామని వెల్లడించారు. మాజీ ప్రధాని అటల్ వాజ్‌పేయిని తాము గౌరవిస్తామని, అందుకే ఆయన పేరుతో ఉన్న టన్నెల్ పేరును తమ ప్రభుత్వం మార్చబోదని స్పష్టం చేశారు.కాగా, హిమాచల్ ప్రదేశ్‌కు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓడిపోయింది. ఈ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ పార్టీ ఆ రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో అటల్ టన్నెల్ పేరు మార్పుపై ఊహాగానాలు వెలువడ్డాయి.

# తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు, వర్ధంతి



మచిలీపట్నం టౌన్ : డిసెంబర్ 15 : ప్రజాపాలన :ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు ఆమరణ నిరాహారదీక్ష చేసి,ప్రాణాలర్పించి,అమరజీవి యైన మహాపురుషుడు,పొట్టి శ్రీరాములు, వర్ధంతి సందర్భంగా కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు మరియు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల జగన్నాధరావు (బుల్లయ్య ) ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ మనకు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత తెలుగు వారందరు మద్రాసులు లో ఉన్నపుడు ఆంధ్రావాళ్లంటే ఎవ్వరికి తెలియదు మద్రాసు వాళ్లమే తెలుసు.మద్రాసు మొదలు తంజావూరు వరకు తెలుగువారితో నిండిపోయింది.కానీ తెలుగుకు ప్రాధాన్యత లేక తెలుగు వారికీ గుర్తింపు ఉండేది కాదు ఆ అవమానాన్ని భరించలేక పొట్టి శ్రీరాములు గారు సర్కార్ ఎక్స్ ప్రెస్ లో గుడివాడలో ఎక్కి మద్రాసులో దిగి 1952 అక్టోబర్ 19న బులుసు సాంబమూర్తిగారి ఇంట వద్ద దీక్ష ప్రారంభించారు. తదుపరి 58 రోజులతరువాత అయన దేహాన్ని ఆంధ్ర రాష్ట్ర అవతరణకు బలి అర్పణ చేసుకొన్నారు .అయన మరణం తరువాత 1953 అక్టోబర్ 1న కర్నూలు రాజధానిగా తెలుగు వారి కొరకు తెలుగు మాట్లాడేవారి కొరకు ప్రత్యేక రాష్ట్రము ఆంధ్ర రాష్టం ఏర్పడింది. అప్పటినుండి ఈ రాష్ట్రాన్ని ఎంతోమంది ప్రముఖులు పాలించారు రాజధానులను కూడా మార్పులు చేసారు కానీ ఈ జగన్ మోహన్ రెడ్డి పరిపాలన వచ్చినాక ఎన్నో త్యాగాలతో ఏర్పాటు చేసుకున్న ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసి చరిత్ర హీనుడయ్యాడు .ఆనాడు చంద్రబాబు గారు రాజధానిగా అమరావతి ని ప్రతిపాదించినపుడు రాజధాని అమరావతి అయితే మాకు సమ్మతమేనని చెప్పిన ఈ జగన్ మోహన్ రెడ్డి మరియు వైసీపీ మంత్రులు మ్మెల్యే లు ఇప్పుడు మూడు రాజధానులు అంటూ మూడు ముక్కలాట ఆడుతున్నారు .రాజధానిపై నీవు ఆడుతున్న మూడు ముక్కలాట చరిత్ర మర్చిపోదు. జగన్ మోహన్ రెడ్డి గుర్తుపెట్టుకో నీవు చేసే ప్రతి పని ప్రజలు చూస్తున్నారు నిన్ను నీ మంత్రులను నీ ఎమ్మెల్యే లను గద్దె దించడానికి ఈ రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారని ఆయన ఈ సందర్భముగా హెచ్చరించారు. అదేవిదంగా కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ల నారాయణరావు ఆదేశానుసారం మచిలీపట్టణం పార్లమెంట్ కార్యాలయమునందు కూడా అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో మోటమర్రి బాబా ప్రసాద్ ,సమతా కీర్తి ,రాళ్లకొట్టు రాము ,దింటకుర్తి సుధాకర్ ,అన్నం ఆనంద్ , బత్తిన దాస్ ,మారకాని పరబ్రహ్మం ,లంకె శేషగిరి రావు , ఇలియాస్ పాషా గారు ,కుంచె నాని గారు ,పివ్వళ్ల కాంతారావు ,కారసాని భాగ్యారావు ,కొక్కిలిగడ్డ నరసింహారావు గారు ,యార్లగడ్డ సీతారామయ్య గారు , రాఘవేంద్ర రావు ,లంకిశెట్టి నీరజ , పద్మజ ,వీరమల్లు నాగరాజు ,లంకె హరి కృష్ణ ,చిట్టూరి యువరాజ్ ,మోషే ,చిన్నం శివ ,సలీం ,హనుమాన్ ,మరియు పార్టీ ముఖ్య నాయకులు ,పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

## భవిష్యత్తు ప్రయోగాలకి మార్గదర్శనం కోసమే వైజ్ఞానిక ప్రదర్శనలు: చీరాల మండల విద్యాశాఖాధికారి డి.నాగేశ్వర రావు



చీరాల, డిసెంబర్ 15, ప్రజాపాలన : విద్యార్ధులలో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభను వెలికితీసి, భావిశాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు, విద్యా శాఖ ప్రతి యేటా, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించడం అభినందనీయమని, చీరాల మండల విద్యా శాఖాధికారి డి.నాగేశ్వరరావు పేర్కొన్నారు. జిల్లాస్థాయి ప్రదర్శనను నిర్వహించేందుకు, జిల్లా విద్యాశాఖ సన్నద్ధమవుతోన్న వేళ, దానికి సన్నాహకం గా, పేరాల ఆంధ్ర రత్న పురపాలక మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ని గురువారం ప్రారంభించారు. విద్యార్థులు వారి ఆలోచనలకు పదును పెట్టి, కొత్త కొత్త ఆవిష్క రణల ను రూపొందించాల్సి ఉంటుం దన్నారు. రెండేళ్లుగా ఆన్‌లైన్ ద్వారానే వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించగా, ఈ యేడాది ప్రత్యక్షంగా ప్రదర్శనను నిర్వహించేందుకు, విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోందని అన్నారు.విద్యార్థులు చేసిన ఆవిష్కరణలను ఎంఈవో తిలకించి, వారిని ప్రశ్నలు వేసి, పర్యావరణం, ఆరోగ్యం, పరిశుభ్రత, పర్యావరణానికి సంబంధించిన అంశాలు, గణితం, సమాచార, కమ్యూనికేషన్ టెక్నాలజీ లో ప్రగతి, ప్రస్తుత ఆవిష్కరణలు అనే అంశాలలో ప్రాజెక్టులు రూపొం దించారు.మండలం లోని పది హైస్కూల్ లనుండీ 43 ప్రదర్శన లు వచ్చాయి. న్యాయ నిర్ణేతలుగా శ్రీ గౌతమి కళాశాల లెక్చరర్ లు భరత్, మస్తాన్ రావు, ఎం.శ్రీనివాసరావు లు వ్యవహరించారు. సైన్స్ లో ప్రతిభ కనబరుస్తూ ఉన్న విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.కార్యక్రమంలో నోడల్ ప్రధానోపాధ్యాయులు బి.సాల్మన్, రావి వెం కట రమణ,జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ పవని భానుచంద్ర మూర్తి, సైన్స్ ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, గాంధీ, శ్రీని వాస్, యలమందేశ్వర రావు, ఉపాధ్యాయురాలు సిహెచ్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ ప్రభుత్వంతో హెచ్సీజీ క్యాన్సర్ సెంటర్ అవగాహన ఒప్పందం



విజయవాడ,ప్రజాపాలన ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్లోని ఆరోగ్య సంరక్షణ నిపుణులు క్యాన్సర్ పరీక్షలు చేయడం, చికిత్స శిబిరాలను తాలూకా హాస్పిటల్స్ సైతం చేసేలా అవసరమైన సమగ్రమైన శిక్షణను ఆంకాలజీలో అందించేందుకు వీలుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో హెచ్సీజీ క్యాన్సర్ సెంటర్ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందాన్ని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్యా శాఖ మంత్రి విడదల రజిని, ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి నవీన్ కుమార్, హెచ్సీజీ క్యాన్సర్ సెంటర్ విజయవాడ, ఒంగోలు క్లస్టర్ సీఓఓ రవికిరణ్, బెంగళూరులోని హెచ్సీజీ క్యాన్సర్ సెంటర్ హెడ్ అండ్ నెక్ సర్జికల్ ఆంకాలజీ, రోబోటిక్ సర్జరీ గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ విశాల్ రావు సమక్షంలో జరిగింది. గ్రామీణ ప్రాంతాలలో క్యాన్సర్ వైద్య సేవలను అందించే నిపుణులు, పేషంట్ రేషియో నడుమ ఉన్న అంతరాలను పూరించడంలో ఈ ఎంఓయు ఓ ప్రతిష్టాత్మక ముందడుగుగా నిలుస్తుందని హెచ్సీజీ క్యాన్సర్ సెంటర్ విజయవాడ- ఒంగోలు క్లస్టర్ సీఓఓ రవి కిరణ్ అన్నారు.

## పి ఎన్ సి కె ఆర్ స్కూల్ అండ్ కాలేజీ ఆఫ్ నర్సింగ్ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో బ్లడ్ డొనేషన్ క్యాంప్



పల్నాడు జిల్లా. నరసరావుపేట. డిసెంబర్ 15 (ప్రజాపాలన ప్రతినిధి.) పి ఎన్ సి అండ్ కేఆర్ స్కూల్ కాలేజీ ఆఫ్ నర్సింగ్ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో హెచ్ డి ఎఫ్ సి వారి సహకారంతో మెగా బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి శ్రీమతి జి. శోభ రాణి డిఎంహెచ్ ఓ , డాక్టర్ పద్మావతి జిల్లా ఎడిట్స్, లెప్రసీ, టీవీ, కంట్రోల్ ఆఫీసర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శోభారాణి మాట్లాడుతూ విద్యార్థులు రక్తదానం చేయటం ద్వారా మరొకరికి ప్రాణదానం చేసేవారు అవుతారని అన్నారు. డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ రక్తం పారిశ్రామికంగా తయారు కాదని రక్తదానం మాత్రమే రక్షిస్తుందని అన్నారు. విద్యార్థి దశలోనే సేవాభావం అలమరుచుకొని సమాజ శ్రేయస్సు పాటుపడాలని కాంక్షించారు. ఈ రక్తదాన శిబిరంలో 48 యూనిట్ల రక్తదానం చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రెటరీ పాలడుగు శ్రీనివాస్ ప్రసాద్ , నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ గోపీనాథ్ , ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీస్ సార్ ఏ కుమారి ,ఏ సాయినాథ్, ఎం అనిల్ కుమార్ ,ఎన్నార్టీ బ్లడ్ బ్యాంక్ హెచ్ డి ఎఫ్ సి సుధాకర్ , జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అమరజీవి పొట్టి శ్రీరాముల వర్ధంతిని ఘనంగా నివాళులు అర్పించిన టిడిపి నేతలు



పల్నాడు జిల్లా. నరసరావుపేట. డిసెంబర్ 15 (ప్రజాపాలన ప్రతినిధి)పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం అమరజీవి పొట్టి శ్రీరాముల వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విభిన్న ప్రతిభ వంతుల అధ్యక్షులు పూదోట సునీల్, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొట్టిపాటి జనార్దన్ బాబు, రాష్ట్ర మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి మన్నన్ షరీఫ్, రాష్ట్ర వాణిజ్య విభాగం నాయకులు అత్తులూరి సుబ్బారావు, వనమా శివ, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, జిల్లా టి.ఎన్.టి.యు.సి ప్రధాన కార్యదర్శి జాస్తి చంద్ర శేఖర్, జిల్లా మహిళా అధికార ప్రతినిధి కనుమూరి లక్ష్మి, స్టేడియం మాజీ క్రీడల ఇంచార్జ్ సభ్యులు షేక్ జిలాని మాలిక్, నాయకులు కొత్తూరి హనుమంతరావు, నాగసరపు ప్రసాద్, సురేంద్ర, తాళ్లూరి సత్యనారాయణ, కాకుమాను శ్రీనివాసరావు, రెడ్డి హరినాధ్ బాబు, హరికృష్ణ , విజయ్, తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు సమర్పించి ఘనంగా నివాళులర్పించారుమద్రాసు నుండి తెలుగు వారికి విముక్తి కలిగించాలని ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలని 55 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేశారని, ఆ దీక్ష ఆయన మరణానికి కారణమైందని నేడు ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందంటే, అది శ్రీ పొట్టి శ్రీరాములు చేసిన కృషే నని, ఇది మనందరికీ గర్వకారణమని కొనియాడారు.

## ప్రజల ఇంటి ముంగిటకే పాలన: ఎమ్మెల్యే గ్రంధి



భీమవరం, డిసెంబర్ 15 (ప్రజాపాలన ప్రతినిధి) :ఇంటి ముంగిటకే పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రజల మద్దతు పూర్తిగాఉందని శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం భీమవరం మండలంలోని యనమదుర్రు గ్రామంలో శాసనసభ్యులు గ్రంధి శ్రీనివాస్ ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ద్వారా ప్రజలకు జరిగిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వలంటీర్, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటుచేసి ఇంటి ముంగిటకే పాలన అందిస్తున్నామని అన్నారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటుచేసి వలంటీర్లను వాటికి అనుసంధానం చేసి ప్రజలకు మేలు జరిగే విధంగా చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రజలు పూర్తిగా అండగా ఉన్నారని స్థానిక సంస్థల ఎన్నికల్లో 95 శాతం ఫలితాలను ప్రజలు తమ పార్టీకి అందించారని అన్నారు. గతంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందుకోవాలంటే ప్రజలకు చాలా ఇబ్బందులు తలెత్తేవని తమ ప్రభుత్వంలో అర్హులైన వారు వలంటీర్ ద్వారా సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న నిర్ణీత గడువులోగానే అర్హులైన వారికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత దేశంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మాత్రమే దక్కిందని అన్నారు. ముఖ్యంగా గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా నవరత్న పథకాలను అమలు చేస్తూనే, మరికొన్ని సంక్షేమ పథకాలను కూడా ముఖ్యమంత్రి ప్రజలకోసం ప్రవేశ పెట్టారని అన్నారు. ప్రతి గ్రామంలోనూ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైయస్సార్ హెల్త్ క్లినిక్లను ఏర్పాటుచేసి ప్రజలకు ప్రభుత్వ పాలనను చేరువ చేశారని తెలిపారు. విద్యార్థుల ఉన్నత చదువుల కోసం అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన, జగనన్న విదేశీ దీవెన, జగనన్న విద్యా కానుక వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహారాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, తాసిల్దార్ వై రవికుమార్, ఇన్చార్జి ఎంపీడీవో రామచంద్ర ప్రభు, జేఈలు నరసయ్య, శశి కుమార్, శ్రీనివాస్, కనకారావు, సర్పంచులు నాగిడి నారాయణస్వామి, జల్లా కొండయ్య, తిరుమాని శ్రీనివాస్, కోళ్ల బాలకృష్ణ, గ్రామ ఉపసర్పంచ్ తిరుమల విజయరామ్, నాయకులు కోటా ఏసురత్నం, బద్దా శాంతారావు, కాటూరి ఎస్సై, ఎడ్లపల్లి లక్ష్మణస్వామి, పసనకర్ల మురళీకృష్ణ, తులా రాంబాబు, దేవభక్తుల దుర్గ, చిన్నమిల్లి నాగన్న, కొట్టి కుటుంబరావు, కొప్పర్తి సత్యనారాయణ, కోమటి రాంబాబు, కోయ శ్రీరామమూర్తి, చిలకపాటి ప్రకాష్, తిరుమాని ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

## రావులపాలెం క్రిస్మస్ ఆరాధనలో పాల్గొన్న ప్రభుత్వ విప్ చిన్న జగ్గిరెడ్డి



రావులపాలెం డిసెంబర్ 14 ప్రజాపాలన ప్రతినిధి. :కొత్తపేట నియోజకవర్గ శాసనసభ్యులు మరియు రాష్ట్ర ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి రావులపాలెంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. బుధవారం రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల మైదానంలో పాస్టర్ ఇసాక్ ఆధ్వర్యం లో జరిగిన క్రిస్మస్ వేడుకలలో ప్రభుత్వ విప్ మరియు శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గి రెడ్డి వెంట నియోజకవర్గ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు వర్ధంతికి నివాళులర్పించిన జిల్లా కలెక్టర్, జెసి, అధికారులు



మచిలీపట్నం కలెక్టరేట్: డిసెంబర్ 15 : ప్రజాపాలన :అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్పి. రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ అధికారులతో కలసిగురువారం కలెక్టరేట్లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసిఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూఆంధ్రరాష్ట్ర సాధనకై నిరాహారదీక్షా చేసి ప్రాణాలు అర్పించి అమరజీవి అయిన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు అని జిల్లా కలెక్టర్ కొనియాడారు.

## గుడివాడ టిడిపి కార్యాలయంలో ఘనంగా జరిగిన పొట్టి శ్రీరాములు 70వ వర్ధంతి కార్యక్రమాలు



గుడివాడ, ప్రజాపాలన ప్రతినిధి డిసెంబర్ 15: గుడివాడ టిడిపి కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, టిడిపి నాయకులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలతో ఘన నివాళులర్పించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణ త్యాగాన్ని తెలుగుజాతి ఎన్నటికీ మరువదని రావి అన్నారు.

## ముంజవరం గ్రామం గడప-గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు



పి. గన్నవరం డిసెంబర్ 15 ప్రజాపాలన ప్రతినిధి.:పి. గన్నవరం నియోజకవర్గం పి గన్నవరం మండలం కె. ముంజవరం గ్రామం రెండు రోజు గురువారం గడప-గడపకు మన ప్రభుత్వం మన కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు కొండేటి చిట్టిబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రజా సమస్యలను అడిగి,ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకున్ని , ప్రతి సమస్య పరిష్కరించాలని, సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు,పార్టీ రాష్ట్ర డైరెక్టర్లు ఎంపీపీలు ,జడ్పీటిసిలు,సర్పంచులు,ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్ లు,వివిధ గ్రామ శాఖ అధ్యక్షులు పార్టీ శ్రేణులు,సచివాలయ సిబ్బంది,వలంటీర్లు పాల్గొన్నారు.

## జనవరి వద్దు ఉగాది సంబరాలు ముద్దు..: తోట సాయిబాబా



గోకవరం ప్రజా పాలన ప్రతినిధి డిసెంబర్ 15: తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలంలోనీ తిరుమలాయపాలెం గ్రామంలో గురువారం నాడు హిందూ సనాతన ధర్మ ప్రబోధన సమితి ఆధ్వర్యంలో జనవరి వద్దు ఉగాది ముద్దు కార్యక్రమం నిర్వహించబడింది ఈ కార్యక్రమంలో భాగంగా హిందూ ధర్మ సనాతన ప్రబోధన సమితి కార్యకర్తలు ఆడంబరాలకు వెళ్లి జనవరి 1 తేదీన కొత్త సంవత్సరానికి స్వాగతం చెప్పే కార్యక్రమాలను విడనాడి హిందువుల నూతన సంవత్సరమైన తెలుగు సంవత్సరాదిని తమ ఇళ్ళలో ఆడంబరంగా జరుపుకోవాలని నినాదాలు చేస్తూ తిరుమలాయపాలెం గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు తోట సాయిబాబా కార్యదర్శి పీల్లం గోరి బాబురావు మరియు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు

## పి యు సి ఎఫ్ ఆధ్వర్యంలో న్యాయవాది సోనీ అహ్మద్‌కు సన్మానం



పొన్నూరు డిసెంబర్14( ప్రజా పాలన ప్రతినిధి) : పొన్నూరు పట్టణం నిడుబ్రోలు పాస్టర్స్ యూనివర్సిల్ క్రిస్టియన్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో బుధవారం సెమీ క్రిస్టమస్ వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో దైవజనులు ప్రసంగిస్తూ లోక పాప పరిహార్ధమై ఏసుక్రీస్తు భూలోకంలో మనిషి రూపంలో జన్మించారని జన్మ దినాన్ని పురస్కరించుకొని ప్రపంచవ్యాప్తంగా ప్రజలు క్రిస్టమస్ వేడుకలు జరుపుకుంటారని పేర్కొన్నారు. ఏసుక్రీస్తు చూపిన మార్గం ప్రతి ఒక్కరు అనుసరించి పరలోక రాజ్యానికి వారసులు కావాలని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది వృత్తితొ పాటు సంఘ సేవను చేస్తున్న షేక్ సోని అహ్మద్ ను కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. పాస్టర్లతో పాటు మహిళా లు సోనీ అహ్మద్ కు అభినందనలు తెలిపారు. సెమీ క్రిస్మస్ సందర్భంగా పి యు సి ఎఫ్ నిర్వాహకులు కేకును కట్ చేసి పలువురికి పంపిణీ చేశారు.

## సి ఐ టి యు విశాఖ జిల్లా మహాసభలు




భీమిలి ప్రజాపాలన ప్రతినిధి డిసెంబర్ 15 : డిసెంబర్ 22 23 తేదీల్లో జరిగిన మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో పోస్టల్ ఆవిష్కరణ జరిగినది ఈ సందర్భంగా సిఐటియు జోను ప్రెసిడెంట్ ఆర్ ఎస్ ఎన్ మూర్తి మాట్లాడి తూ స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని కనీస వేతనం 26000 అమలు చేయాలని కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఆశ అంగన్వాడి వివో ఏ ఎం డి ఎం ఆర్పీలను ఉద్యోగులుగా గుర్తించాలని ఆటో తోపుడు బండ్లు భావన నిర్మాణ కార్మికుల కు రక్షణ సమగ్ర చట్టం చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంస్థలలో కాళీ ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో జోన్ కార్యదర్శి రవ్వ నర్సింగరావు జోన్ కమిటీ సభ్యులు సిహెచ్ రాము మొగుడు ఈశ్వరరావు వాళ్ల నాగరాజు భీమిలి ముతా నాయుడు స్వామి వెంకట్ పాల్గొన్నారు.

## డి బి ఆర్ సి ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు అందజేత



ముప్పాళ్ళ ప్రజాపాలన ప్రతినిధి(డిసెంబర్15): పల్నాడు జిల్లా,ముప్పాళ్ళ మండలం:దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ముప్పాళ్ళ జడ్పీహెచ్ఎస్ స్కూల్ నందు రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగానికి సంబంధించిన ప్రశ్నలతో 8 ,9, 10, చదువుతున్న విద్యార్థులకు వ్యాసరచన క్విజ్ పోటీలు నిర్వహించడం జరిగింది గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్ల బహుమతులు అలాగే స్కూల్ కి మూమెంట్ అందజేయడం జరిగింది నీ దళిత బహుజన రిసోర్సెంటర్ కోఆర్డినేటర్ మే డే వెంకటరమణ తెలియజేశారు ఈ సందర్భంగా హెచ్ఎం వి పార్వతీ మాట్లాడుతూ విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రతి విద్యార్థి క్రమశిక్షణ విద్య క్రీడలు సామాజిక అంశాలపై ప్రాథమిక స్థాయి నుంచి పోటీ తత్వంతో అవగాహన కలిగి కులమత బేధ తేడాలు లేకుండా విద్యార్థులు కలిసిమెలిసి ఉండాలని సూచించారు ఏపిఎం బాలస్వామి మాట్లాడుతూ విద్యతోపాటు రాజ్యాంగ అంశాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండటాన్ని అభినందించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

## ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో గోకవరం అమరజీవి వర్ధంతి



గోకవరం ప్రజాపాలన ప్రతినిధి డిసెంబర్ 15తూర్పుగోదావరి జిల్లా గోకవరంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వారికి గోకవరంలోని శ్రీ వాసవి ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఆర్యవైశ్య కళ్యాణమండపం వద్ద ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమర్ జీవి అమర్ రహే అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. అమరజీవి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సేవా సంఘ సభ్యులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు 70వ వర్ధంతి వేడుకలు




దుర్గి ప్రజాపాలన ప్రతి నిధి :మండల కేంద్ర మైన దు ర్గిలో బస్టాండ్ సెంటర్ లోవున్న అమరజీవి పొట్టి శ్రీరాములువిగ్రహం కు ఆయన 70 వవర్ధంతి ని పురష్క రించుకొని ఆర్యవైశ్య సంఘం నాయకులు ప్రజాప్రతినిధులు కొబ్బరికాయలు కొట్టి పూలమా లలు వేసి ఘనంగా నివాళు లు అర్పించారు. ఈసందర్భంగా దుర్గి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదం డి గోపాల్ పాల్గొని మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం కోసం 56రోజులు ఆమరణధీ క్ష చేసి ప్రాణత్యాగం చేసిన మహానీయులు పొట్టి శ్రీరాములు అనీ ఆయన సేవలను కొన్ని యాడారు.ఆర్యవైశ్య దుర్గిమండల అధ్య క్షుడు కపలవాయి శ్రీ ని వాసరావు మాట్లాడు తూ పొట్టి శ్రీ రా ములు ఆంధ్ర రాష్ట్రానికి చేసిన సేవలను గుర్తించి నె ల్లూరు జిల్లా కు పొట్టి శ్రీరాములు జిల్లా గా పేరు నామకరణంచే సిన ఘనత వైసిపి అధి నేత ప్రస్తుత మనప్రియ తమ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి కే దక్కిందన్నారుదుర్గి మండలఆర్యవై శ్య సంఘయువజన నాయకులు కాసుల లక్ష్మీ నారాయణ మా ట్లాడుతూ పొట్టి శ్రీరా ములు ఆశయాల ను ఆలోచన విధానాన్ని అమలు చేయవలసిన బాధ్యతయువత పై వుందన్నారు. వాసవీ క్లబ్ దుర్గి మండల అధ్యక్షుడు కాసుల ప్రసాద్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆం ధ్రప్రదేశ్ ప్రజల గుండె ల్లో చిరస్మర ణీయుడు గానిలిచారన్నారు.ఈకార్యక్రమంలోఆర్యవైశ్య సంఘ పెద్దలు కప లవాయి పెద్ద అప్పారా వు.కపలవాయి సూర్య నారాయణ., గ్రంధి సు బ్బారావు. పలుచూరి నాగేశ్వరరావు.వైసిపి నాయకులు చెన్నుపా టి.సీతారామయ్య తదితరులు పాల్గొ న్నారు,

## పొట్టి శ్రీరాములుకి ఘన నివాళి అర్పించిన టీడీపీ నాయకులు



సత్తెనపల్లి ప్రజాపాలన ప్రతినిధి: పొట్టి శ్రీరాములు వర్ధంతి నేడు.పొట్టి శ్రీరాములు ఒక గాంధేయవాది...ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం యాభై ఎనిమిది రోజులు నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన వ్యక్తి శ్రీ పొట్టి శ్రీరాములు..ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించి, అమరజీవి యైన మహాపురుషుడు, పొట్టి శ్రీరాములు, ఆంధ్రులకు ప్రాంత. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడైనవాడు. మహాత్మా గాంధీ బోధించిన సత్యము, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాలకొరకు జీవితాంతం కృషిచేసిన మహనీయుడు..త్యాగ జీవి పొట్టి శ్రీరాములు గారికి ఘన నివాళి తెలియజేస్తూ సత్తెనపల్లి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయం (యన్,టి,ఆర్ భవన్ లో) ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించడం జరిగిందిలి.... ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా తెలుగుదేశంపార్టీ ఉపాధ్యక్షులు సయ్యద్ పెద కరిముల్లా, పల్నాడు జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యదర్శి బత్తుల చంద్రశేఖర్, పట్టణ పార్టీ ప్రదాన కార్యదర్శి షేక్ మస్తాన్ వలి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆతుకూరి నాగేశ్వరరావు, ప్రముఖ ఆర్య వైశ్యు నాయకులు పోతుగంటి నరసింహారావు, పల్నాడు జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు షేక్ కోలుముల సైదా, హాస్పటల్ కమిటీ మాజీ డైరెక్టర్ రాంబో బుడే, మాజీ కౌన్సిలర్ పోట్ల అంజనేయులు, భీమవరం మాజీ సర్పంచ్ కొల్లు రామ మల్లేశ్వరరావు, గాలి ఆంజనేయులు, బండారు నాగరాజు, రైతు నాయకులు మక్కేన వెంకట్రామయ్య, సుఖమంచి నరసింహారావు, సత్తెనపల్లి మండల యస్,సి సెల్ అధ్యక్షులు కొదమల కోటేశ్వరరావు, గడ్డిపర్తి కోటి, తదితరులు పాల్గొన్నారు....

## ఎంపీ గురుమూర్తి చొరవతో తిరుపతి విమానాశ్రయంలో శ్రీవాణి ట్రస్ట్ ప్రారంభం




ప్రజాపాలనన్యూస్ శ్రీకాళహస్తి: తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికులకు కరెంటు బుకింగ్ లో శ్రీవారి దర్శన టికెట్లు అందుబాటులో ఉండేవిధంగా శ్రీవాణి ట్రస్ట్ కౌంటర్ ఏర్పాటు కోసం తిరుపతి ఎంపీ గురుమూర్తి చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ఈరోజు టీటీడీ జె.ఈ.ఓ వీరబ్రహ్మం గారి చేతుల మీదుగా ఈ కౌంటర్ ప్రారంభించారు. తిరుపతి విమానాశ్రయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గా విమానాశ్రయ అభివృద్ధికి కోసం శ్రమిస్తున్న ఎంపీ గురుమూర్తి గతంలో ఈ విషయాన్ని టీటీడీ చైర్మన్, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. శ్రీవాణి ట్రస్ట్ కరెంటు బుకింగ్ కౌంటర్ విమానాశ్రయంలో ఏర్పాటు చేయడం వలన తిరుపతి విమానాశ్రయం ద్వారా ప్రయాణించే ప్రయాణికులు అప్పటికప్పుడు దర్శనం చేసుకొనేందుకు టికెట్లు అందుబాటులో ఉంటాయని తద్వారా విమానాశ్రయంలో ప్రయాణికుల రద్దీ పెరుగుతుందని ఆయన అన్నారు. ఈ కౌంటర్ ఏర్పాటుకు సహకరించిన గౌరవ ముక్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారికి, తితిదే చైర్మన్ సుబ్బారెడ్డి గారికి, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డి గారికి, టీటీడీ ఈఓ ధర్మారెడ్డి గారికి ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చీఫ్ ఇంజినీర్ శ్రీ నాగేశ్వరరావు, ఎయిర్పోర్ట్ డీజీఎం టెర్మినల్ శ్రీ చంద్రకాంత్, కమర్షియల్ మేనేజర్ శ్రీ అవినాష్ టెర్మినల్ మేనేజర్ శ్రీ మణిదీప్, టీటీడీ ఐటి విభాగం జి ఎం శ్రీ సందీప్ హెచ్ డి ఎఫ్ సి బ్యాంకు మేనేజర్ శ్రీ శ్రీకాంత్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ,కలెక్టర్ లోటేటి శివ శంకర్



పల్నాడు జిల్లా నరసరావుపేట డిసెంబర్ 15 ప్రజాపాలన ప్రతినిధి.అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని పొట్టి శ్రీరాములు సేవ సమితి వారి ఆధ్వర్యంలో నరసరావుపేట పట్టణంలోని శివుని బొమ్మ సెంటర్ వద్ద గల అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి గౌరవ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి , పలనాడు జిల్లా కలెక్టర్ శివ శంకర్ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు.అనంతరం ఏర్పాటు చేసిన భహిరంగ సభలో మాట్లాడుతూ... మహాత్మా గాంధీతో పాటు దాదాపు రెండు దశాబ్దాలు శ్రీరాములు ప్రయాణం చేశారని అన్నారు . ఆయన అహింస సిద్ధాంతాన్ని బాగా విశ్వసించి, పలుమార్లు ఆచరించి. విజయం సాధించారన్నారు. అదే మార్గంలో ఆమరణ నిరహార దీక్ష చేసి ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ప్రాణ త్యాగం చేశారని అన్నారు. అలాంటి మహొన్నత వ్యక్తి జీవిత చరిత్ర నేటి విద్యార్థుల పుస్తకాల్లో లేకపోవడం దురదృష్టకరం అన్నారు. పొట్టి శ్రీరాములు జీవిత చరిత్ర పాఠ్యాంశాలలో చేర్చెలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ని కోరారులిఅభివృద్ధి లేదు అని నిత్యం తమపై పడి ఏడ్చే వారిపై సభా వేదికపై నుంచి విమర్శలు గుప్పించారు. ఇవాళ నరసరావుపేట కేంద్రంగా ఏర్పడిన పల్నాడు జిల్లాకు సంబంధించి.. పల్నాడు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఏర్పాటు చేస్తూ కేబినేట్ నిర్ణయం తీసుకోవడం ద్వారా.. రూరల్ ప్రాంతంలో హౌసింగ్ వేగవంతం అవుతుంది అన్నారు. అలాగే సంతగుడిపాడు వెటర్నరీ పాలిటెక్ కళాశాల ఏర్పాటు, ఆటోనగర్, కోటప్పకొండ రోడ్డు ఏర్పాటు వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను నిత్యం జరుగుతూనే ఉన్నాయన్నారు .అనంతరం విద్యార్థులకు ఎగ్జామ్ కి కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులు పాల్గొన్నారు.

## బసి కాపురం చర్చికి నా వంతు సహాయం అందిస్తా: ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి




పల్నాడు జిల్లా. నరసరావుపేట. డిసెంబర్ 15 (ప్రజాపాలన ప్రతినిధి): బసికాపురం గ్రామంలో చర్చ్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి , మాజీ మంత్రి వర్యులు కాసు కృష్ణారెడ్డి పాల్గొన్నారు. నరసరావుపేట రూరల్ మండలం బసికాపురం గ్రామంలో నూతనంగా నిర్మించే సెయింట్ పాల్ లూథరన్ చర్చ్ నిర్మాణమునకు శంకుస్థాపన కార్యక్రమంలో గౌరవ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి , మాజీ మంత్రి వర్యులు కాసు కృష్ణారెడ్డి పాల్గొన్నారు. సంఘస్తులు, గ్రామ పెద్దల సమకంలో ఘనంగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గౌరవ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. బసికాపురం గ్రామం నాడు కాంగ్రెస్ పార్టీకి నేడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉందన్నారు. తాము ఏ కార్యక్రమం చేపట్టినా ముందుగా బసికాపురం గ్రామం నుంచే ప్రారంభించడం జరుగుతుంది అన్నారు. పేదల కోసం కేటాయించిన 18 ఎకరాల స్థలంలో నేడు 18 సెంట్లు చర్చ్ నిర్మాణం కోసం కేటాయించుకోని శంకుస్థాపన జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. చర్చ్ నిర్మాణానికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామన్నారు అనంతరం నిర్వహించిన ప్రత్యేక ప్రార్ధనలో ఎంపీపీ మూరబోయిన సుబ్బాయమ్మ %--% శ్రీనివాసరావు , జెడ్పీటీసీ చిట్టిబాబు , సర్పంచ్ రాజేష్ , ఎంపీటీసీ జాన్ గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగ ఫలితంగానే భాషా ప్రయక్త రాష్ట్రాలకు నాంది:టీడీపీ నాయకులు గొట్టిపాటి, డా.చదలవాడ



పల్నాడు జిల్లా. నరసరావుపేట .డిసెంబర్ 15 (ప్రజాపాలన ప్రతినిధి): ఆంధ్రరాష్ట్ర సాధన కొరకు ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించిన మహాపురుషుడు అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు గారి వర్ధంతి సందర్భంగా నరసరావుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శ్రీపొట్టి శ్రీరాములు గారి చిత్రపటానికి అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవి,నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం కోసం,ప్రజల కోసం త్యాగాలు చేసిన మహనీయులను స్మరించుకోవటం మన బాధ్యత అని,వారి పోరాట స్పూర్తితో సమాజహితం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొట్టిపాటి చౌదరి బాబు,గొట్టిపాటి జనార్దన్ బాబు,ఇమిడిశెట్టి కాశయ్య,షేక్ మాబు,యంపరాల ఖాసీం, సయ్యద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన

సంపాదకీయం

శుక్రవారం 16, డిసెంబరు 2022

## 'జాతీయ' లోగుట్టు పెరుమాళ్ల కెరుక!

రాజకీయాలలో ఆరితేరిన వారికి చాలా విద్యలుంటాయి. అన్నిసార్లూ అందరికీ అర్థమయ్యే విధంగా నడచుకోరు. ప్రయోజనం ఏమిటో, ఉద్దేశం ఏమిటో ఊహించుకోవలసిందే తప్ప కొన్ని వ్యూహాలకు ప్రతిపదార్థ తాత్పర్యాలు దొరకవు. మరీ, ముదిరిపోయిన చాణక్యుల విషయంలో ఊహాగానాలకు కూడా ఆస్కారం ఉండదు. అంతుచిక్కని అంతరార్థాలను వెదికి బుర్రలు పగలిపోవలసిందే తప్ప, అజ్ఞానాంధకారం విడిపోదు. ఈ భారత రాష్ట్రసమితి (బిఆర్ఎస్) ఎందుకు అన్న ప్రశ్న చాలా కఠినమైనది. ఎన్ని మల్టిపుల్ చాయిస్ సమాధానాలు ఇచ్చినా ఏదీ సరిపోదు. తమకు అర్థం కాని విషయాలకు తమకు అర్థం అయ్యే వివరణలు ఇచ్చుకుంటారు సామాన్యులు. సంఖ్యాశాస్త్రమో, అక్షరశాస్త్రమో సరిపోలేదని, మోదీ మొహం చూడకూడదని ఎవరో స్వామి చెప్పాడని, తల మీద కౌబాయ్ టోపీ వెనుక బల్లిశాస్త్రమో, అక్షింతల శాస్త్రమో ఉన్నదని చెప్పుకుంటున్నారు. అటువంటివి కెసిఆర్ నమ్ముతారని, పాటిస్తారని చెప్పడానికి ఆధారాలేమీ లేవు కానీ, ఆయన నమ్ముతారని జనం కొందరయినా నమ్మడమే విచారకరం. ఇటువంటి అభిప్రాయాలు వాడుకలో ఉన్నాయి కాబట్టే, ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా తెలంగాణ ముఖ్యమంత్రి మీద విమర్శించడానికి మరేమీ లేనట్టు, ఈ అంధ విశ్వాసాల గురించే మాట్లాడతారు. ప్రాంతీయపార్టీ జాతీయపార్టీ అయినందువల్ల కాక, పేరు మార్పిడి వల్ల మాత్రమే టిఆర్ఎస్, బిఆర్ఎస్ అయింది. జాతీయపార్టీ అని మనం చెప్పుకున్నంత మాత్రాన కుదరదు. దానికేవో లెక్కలు ఉంటాయి. అటువంటి కొలతలకు సరిపోనప్పుడు, భావనాత్మకమైన లక్షణాలేవో చెప్పాలి. జాతీయ ఎజెండాతో ముందుకు వస్తున్న ప్రాంతీయ పార్టీ అని చెప్పుకోవచ్చు. గతంలో కూడా ఫ్రంట్లు అంటూ చేసిన ప్రయత్నాలలో పెద్దగా స్పందనలు లేకపోతే, ప్రత్యామ్నాయ ఫ్రంట్లు కాదు, ప్రత్యామ్నాయ ఎజెండా కావాలని కెసిఆర్ అనడం మరచిపోలేము. పార్టీలు కాదు, ప్రజలు గెలవాలి అని కూడా ఆయన అన్నారు. కాబట్టి, ఈ బిఆర్ఎస్ సొంతంగానో, మిత్రుల సాయంతోనో దేశవ్యాప్తంగా పోటీచేసి, నెగ్గి, జాతీయస్థాయిలో అధికారంలోకి వచ్చే ప్రయత్నం చేస్తుందా, లేక ఎజెండా గెలుపు కోసం, ప్రజల గెలుపు కోసం భావనాత్మకంగా పనిచేస్తుందా అని సందేహం వస్తుంది. పుట్టి పదేళ్లు అయినా, ఇప్పుడిప్పుడే జాతీయ అడుగులు వేయగలుగుతున్న ఆప్తో పోలిస్తే, బిఆర్ఎస్ ప్రయాణం ఎంత సుదీర్ఘమో అన్న బెంగ కూడా కలుగుతుంది. ఇప్పుడు కేజ్రీవాల్ మీద ఎన్ని విమర్శలు వచ్చినా, ఆప్ మీద ఎన్ని అనుమానాలు ఉన్నా, ఆ పార్టీ పుట్టి పెరిగిన తీరు, పరిపాలనలో అనుసరించిన కొన్ని పద్ధతులు చూసినప్పుడు టిఆర్ఎస్, కెసిఆర్లతో పోల్చడం సరిఅయినదేనా అన్న విచికిత్సా కలుగుతుంది. ఈ యక్ష ప్రశ్నలకు జవాబు వెదకడం కంటె, మంత్రతంత్రాల వదంతులే మెరుగని అనిపిస్తుంది. దేవతావస్త్రాల గురించి మాట్లాడడానికి తలవదులుకోగలిగే ధైర్యం ఉండాలి కాబట్టి, కెసిఆర్ పరివారంలో ఎవరూ ఆయనను వివరణలు కోరరు. ఇన్ని చేసిన నాయకుడు, ఊరికినే ఈ ప్రయత్నం చేస్తాడా, అన్న నమ్మకం కొంత, నమ్మక చేయగలిగేది లేదన్న తెలివిడి కొంత కారణంగా, బిఆర్ఎస్ గురించిన లోగుట్టు ఎవరికీ తెలియకుండా పోయింది. గంటల కొద్దీ టీవీ తెరల మీద చర్చలు చేస్తున్నారు కానీ, ఒక్కరూ కెసిఆర్కు ఏ పొరుగు రాష్ట్రంలోనూ తగినన్ని ఓట్లు రావని, ఈ జాతీయ అభినయానికి, తీవ్రజాతీయవాదంలో ఎవరెస్టును అధిరోహించిన జాతీయపార్టీ భయపడబోదని నిష్కర్షగా చెప్పలేకపోతున్నారు. ఆత్మరక్షణ కోసం ప్రదర్శిస్తున్న ఈ దూకుడు అసలుకే మోసం తేగలిగే అవకాశం గురించి హెచ్చరించలేకపోతున్నారు. ఈ శుష్క ప్రయాస కంటె, చేయగలిగేదేదో సొంతరాష్ట్రంలో పట్టు పెంచుకోవడానికి చేస్తే ఫలితం ఉంటుందని ఎవరూ సలహా ఇవ్వలేకపోతున్నారు. అన్నవస్త్రాలు, ఉన్నవస్త్రం కథ గుర్తు చేయలేకపోతున్నారు. ఢిల్లీకి వెళ్లి ఎల్లిపాయ తెచ్చాడనే అపహాస్యపు సామెతకు జీవం పోయవద్దని వారించలేకపోతున్నారు. రాజకీయ ఉనికే తెలంగాణ కదా, దాన్ని పార్టీ పేరులోనుంచి తీసేయడం ఏమిటి? తన ప్రయాణాన్ని తానే తుడిచివేసుకుంటున్న దృశ్యం, కెసిఆర్ విమర్శకులకు కూడా రుచించడం లేదు. రెండో అధికార హయాం ముగిసే సరికి తెలంగాణలో దృశ్యం ఎట్లా మారిందో చూడండి, జగన్ సోదరి కలకలం సృష్టిస్తున్నారు, పవన్ కళ్యాణ్ కూడా రంగంలోకి సై అంటున్నారు. తెలుగుదేశం కథ తెలంగాణలో ముగిసిందనుకుంటే, ఖమ్మం సభతో కాకపుట్టిద్దామని అనుకుంటున్నారు. చిన్నవిగా చితకవిగా కనిపించినా ఇంకా అనేక పార్టీలు, బృందాలు.. రాజకీయ వేదిక కిటకిటలాడిపోతోంది. ప్రతిపక్షమే లేకుండా చేయాలని అనుకుంటే, చివరికి అనేకానేక పక్షాలుగా పరిస్థితి మారింది. ఇవన్నీ చీలికలు పీలికలుగా ఉండకపోవచ్చునని, అన్నీ బాహాటంగానో లోపాయికారిగానో జట్టుకట్టవచ్చునని కెసిఆర్ గ్రహించకపోరు. ఒకరిని తగ్గించి మరొకరిని పెంచి, పిట్టపోరు పిల్లితీర్పు లాగా లాభపడదామనుకుంటే, పరిస్థితులు ఎల్లవేళలా మన చెప్పుచేతల్లో ఉండవు. కొనుగోళ్లు చేసీ చేసీ, ఏకస్వామ్యం నెలకొల్పినవారు, చివరకు తమ బలగాలను ఎవరు కొనుక్కుపోతారో అని అనుక్షణం భయపడవలసి వస్తుంది. తెలంగాణ రాజకీయ సంవాదానికి దురుసుతనాన్ని, హద్దుమీరిన భాషను అందించినందుకు, ఇప్పుడు తనను మించి నోరుపారేసుకునే ప్రత్యర్థులను ఎదుర్కొనవలసి వస్తున్నది. ప్రాంతీయనేతలు ప్రాంతానికే పరిమితం కావలసిన పనిలేదు. వ్యక్తిత్వంతో జాతీయస్థాయి ఏమి, అంతర్జాతీయస్థాయి కూడా సాధించుకోవచ్చు. తెలుగునేతలు అనేకమంది జాతీయోద్యమంలోను, ఆ తరువాతా జాతీయ నాయకులయ్యారు. ప్రాంతీయ పార్టీలు పెట్టి కూడా ఎన్టిఆర్, కరుణానిధి, బిజూపట్నాయక్ జాతీయ గౌరవాన్నే పొందారు. 2024 ఎన్నికలకు ముందు ఎన్నికల్లోను జాతీయ ముఖచిత్రాన్ని ప్రభావితం చేయగలిగిన ఏదైనా ప్రయత్నం చేసి, సఫలమైతే, అప్పుడు కేసిఆర్ దేశనాయకుడు కావడం కష్టమేమీ కాదు. గుజరాత్ అభివృద్ధి నమూనా కారణంగా మాత్రమే నరేంద్రమోదీ దేశప్రధాని కాలేదు. ఆ నమూనా దేశ పారిశ్రామికులను, కార్పొరేట్ రంగాన్ని, స్టాక్ మార్కెట్ మదుపరులను ఆకట్టుకుని ఉండవచ్చు. కానీ, దేశవ్యాప్తంగా ప్రజల దృష్టిని ఆకర్షించడానికి ఆయన అనుసరించిన నమూనా మరొకటి ఉన్నది. ఆ నమూనాను ప్రచారం చేయడానికి ఆయన వెనుక పెద్దపార్టీ, ఆ పార్టీ వెనుక పెద్ద యంత్రాంగం అన్నీ ఉన్నాయి. గుజరాత్ నమూనా ప్రజల జీవితాలను ఏ మాత్రం మార్చిందో గుజరాత్కు వెళ్లి చూస్తే తెలుస్తుంది. తెలంగాణకు అసలు ఒక నమూనా ఉన్నదా, ఆ నమూనా వల్ల వాస్తవ ఫలితాలు అనుభవంలోకి వచ్చాయా? అన్నవి ఇక్కడ వేసుకోవలసిన ప్రశ్నలు. సంక్షేమ నమూనా అయినా ఏదో ఉందనుకోవచ్చు, అభివృద్ధి నమూనా ఏమున్నదో అర్థం కాదు. సరే, ఎవరి ఆకాంక్షలు, ఆశలు వారివి, తప్పు పట్టడానికి లేదు. తమ గురించి తాము గొప్పగా ఊహించుకోవడానికి కూడా అందరికీ హక్కు ఉన్నది. ఫలితం ఏమిటన్నదే సమస్య. అట్లాగే, ఒక ప్రాంతీయ రాజకీయ పార్టీ సొంత రాష్ట్రం సాధించుకున్న తరువాత, పాత పరిధుల్లోనే అట్లాగే ఉండాలని ఏమీ లేదు. వీరు వారు, వారు వీరు కావచ్చును. తప్పేమీ లేదు. కానీ, దానికి ఒక క్రమం ఉంటుంది. అట్లా కాక, ప్రతిఫలాలకు దొరికే అనుచరులతో అక్కడి నేతలు ఇక్కడా, ఇక్కడి నేతలు అక్కడా ఫ్లెక్సీలు కట్టగలరు, దీక్షలు చేయగలరు కానీ, జనం మెప్పుపొందగలరా అన్నది ప్రశ్న. తెలంగాణలో షర్మిల, జాతీయస్థాయిలో కెసిఆర్ స్వయంసంధిత బాణాలే కావచ్చును కానీ, వారి గురి ఎవరికి మేలు చేస్తుందని కదా ఆలోచించవలసింది!

## రైతుకు ధీమా ఇవ్వని పంటల బీమా



వాన,చలి, ఎండ లాంటి వాతావరణ పరిస్థితులకు ప్రభావితమవుతూ, ఎటువంటి ఆచ్ఛాదనా లేకుండా ఆకాశం కింద నేరుగా సాగే ఉత్పత్తి ప్రక్రియ వ్యవసాయం. వాతావరణం సహకరిస్తే రైతులకు ఇబ్బంది లేదు. కానీ ప్రకృతి వైపరీత్యాలు – ముఖ్యంగా కరువులు, వర్షాభావ పరిస్థితులు, వడగండ్ల వానలు, పిడుగులు, భారీ వర్షాలు, వరదలు, తుఫాన్లు – సంభవిస్తే పంట దిగుబడులు పడిపోవడం, రైతులు సమస్తం కోల్పోవడం, పండించిన పంట కూడా నాణ్యంగా లేక నష్టాల ఊబిలో కూరుకుపోవడం జరుగుతుంది. రైతుల నష్టాలను తగ్గించి భరోసా ఇవ్వాలనే లక్ష్య ప్రకటనతో దేశంలో 1972లో మొదటిసారి పంటల బీమా కార్యక్రమం రూపొందించి, పైలట్ గా అమలు చేశారు. 50ఏళ్లు గడిచిన తరువాత కూడా దేశంలో పంటల బీమా పథకాల పరిధిలోకి వచ్చిన సాగు విస్తీర్ణం, రైతుల సంఖ్య చాలా తక్కువ. రైతులకు అందిన నష్ట పరిహారం, ప్రయోజనాలు కూడా తక్కువే. పైగా ఈ పథకాలు కొన్ని పంటలకు, కొన్ని ప్రాంతాలకు పరిమితమయ్యాయి. 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం 2016 ఖరీఫ్ నుంచి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించింది. ఈ పథకం అమలు ప్రక్రియలోకి ప్రైవేటు బీమా కంపెనీలను కూడా అనుమతించింది. నిర్దిష్ట మార్గదర్శకాలను కూడా విడుదల చేసింది. కానీ 2019–2020 నాటికే ఈ పథకాలు బలహీనతలను చాటుకున్నాయి. భారీ ప్రీమియం రేట్లతో ప్రైవేటు కంపెనీలను ఆకర్షించిన ఈ పథకాలు 50శాతం రైతులను కూడా బీమా పరిధిలోకి తీసుకురాలేకపోయాయి. రైతుల ప్రీమియం వాటా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రీమియం సబ్సిడీ వాటా మాత్రం వేల కోట్లకు చేరుకుంది. ఫలితంగా బీమా పరిధిలోకి వచ్చిన రైతులకు కలిగిన ప్రయోజనం తక్కువే అయినా, ప్రైవేటు, ప్రభుత్వ రంగ బీమా కంపెనీలు మాత్రం వేల కోట్ల లాభాలను మూట కట్టుకున్నాయి. 2015–2016 గణాంకాల ప్రకారం దేశంలో 14 కోట్ల 60లక్షల మంది భూ కమతాలు ఉంటే, 2016–2017లో 5కోట్ల 83లక్షల మంది రైతులు బీమా పరిధిలోకి వచ్చారు. ఈ సంఖ్య 2019–2020 నాటికి 6కోట్ల 12లక్షల మందికి మాత్రమే పెరిగింది. 2016–17లో బీమా పరిధిలోకి వచ్చిన సాగు భూమి విస్తీర్ణం 5కోట్ల 61లక్షల హెక్టార్లు కాగా, 2019–2020 నాటికి అది 5 కోట్ల ఎకరాలకు పడిపోయింది. విస్తీర్ణం పడిపోయినా, రైతులు చెల్లించిన ప్రీమియం వాటా మాత్రం రూ.4078 కోట్ల నుంచి 4502 కోట్లకు పెరిగిపోయింది. ఈ వాటా డబ్బుతో కలిపి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నాలుగేళ్లలో బీమా కంపెనీలకు లక్షా 7 వేల 382 కోట్ల రూపాయలు ప్రీమియంగా చెల్లించాయి. కానీ ఈ కంపెనీలు రైతులకు చెల్లించిన పరిహారం కేవలం 92 వేల 878 కోట్ల రూపాయలు మాత్రమే. అంటే నాలుగేళ్లలో ఈ బీమా కంపెనీలు రూ.14,504 కోట్ల లాభాలను దండుకున్నాయి. రాష్ట్రంలో 2016–2017లో 9 లక్షల 74 వేల మంది, 2017–2018లో 10 లక్షల 96 వేల మంది, 2018–2019లో 7 లక్షల 99 వేల మంది, 2019–2020లో 10 లక్షల 33 వేల మంది రైతులు పంటల బీమా పరిధిలోకి వచ్చారు. రాష్ట్రంలో 60 లక్షల మంది రైతులు ఉన్నారని దృష్టిలో ఉంచుకుంటే, ఈ సంఖ్య ఎంత తక్కువో అర్థమవుతుంది. 2016–2017లో 8 లక్షల 24 వేల హెక్టర్లు బీమా పరిధిలోకి రాగా, 2019–2020 నాటికి కేవలం 11 లక్షల 34 వేల హెక్టార్ల పంటల సాగు మాత్రమే బీమా పరిధిలోకి వచ్చింది. అంటే మొత్తం 1 కోటీ 45 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణంలో చాలా తక్కువ భూమి మాత్రమే బీమా పరిధిలోకి వచ్చింది. పైగా మొదటి రెండేళ్ళు ఎంతో కొంత బీమా పరిహారం సమయానికి చెల్లించినా, 2018–2019, 2019–2020 సంవత్స రాల పరిహారం మాత్రం – ఇంకా కొన్ని సమస్యలు పెండింగులో ఉన్నప్పటికీ – ఈ మధ్యనే రైతులకు అందింది. 2020 ఖరీఫ్ నుంచి రాష్ట్రంలో పంటల బీమా పథకాలు పూర్తిగా ఆగిపోయాయి. సీజన్ పూర్తి అయిన రెండు నెలల లోపే బీమా పరిహారం రైతులకు చెల్లించాలని మార్గదర్శకాలు ఉన్నప్పటికీ ఆ నియమం అమలు కావడం లేదు. పంటల బీమా పథకం అమలు చేయకపోవడమే కాదు, గత మూడేళ్లుగా ఇన్?పుట్ సబ్సిడీగా ఒక్క రూపాయి కూడా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం సహాయంగా అందించలేదు. ఈ విషయంలో రాష్ట్ర హైకోర్టు రైతులకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా అమలు చేయకుండా సుప్రీంకోర్టుకు అప్పీలుకు వెళ్లింది. అన్ని పంటలలో సాగు ఖర్చులు భారీగా పెరిగిపోయాయి. రైతులకు ఎంఎస్పి కూడా చట్టబద్ధ హక్కుగా అందడం లేదు. ప్రకృతి వైపరీత్యాలు ప్రతి సంవత్సరం పెరుగుతున్నాయి. కానీ పంటల బీమా కింద అందే పరిహారం కానీ, ఇన్?పుట్ సబ్సిడీగా అందే మొత్తాలు కానీ, రైతులకు జరిగే నష్టంలో 10 శాతం కూడా పూడ్చవు. పైగా ఈ బీమా పరిహారం, ఇన్?పుట్ సబ్సిడీ మొత్తాలు తప్పకుండా వాస్తవ సాగుదారులకే అందుతాయన్న గ్యారంటీ లేదు. కౌలు రైతులు, పోడు రైతులు, భూమిపై హక్కులు లేని మహిళా రైతులు ఈ పరిహారం అందక ఎక్కువ నష్టపోతున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయి అనివార్యంగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. రైతులకు పంట రుణాలు సకాలంలో అందకపోవడం, స్వయంగా ప్రీమియం చెల్లించడానికి రైతుల ఆదాయాలు అతితక్కువ ఉండడం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీమా కంపెనీలకు సకాలంలో ప్రీమియం చెల్లించకపోవడం, పంట దిగుబడులు అతి తక్కువగా ఉండడం, ఇండెమ్నిటి స్థాయి 80శాతంగా ఉండడం, పరిహారం చెల్లింపుకు ఏడేళ్ళ సగటుతో పంట సగటు దిగుబడులు లెక్కించడం, ఎక్కువ పంటలకు గ్రామం యూనిట్ గా పంటల బీమా పథకం అమలు కాకపోవడం వల్లా బీమా ప్రయోజనాలు రైతులకు అందడం లేదు. వాతావరణ పంటల బీమా పథకంలో కొన్ని పంటలు మాత్రమే ఉంటున్నాయి. వరి ధాన్యం కంకులు నీళ్ళలో ఎక్కువ రోజులు మునిగి ఉండి నష్టం జరిగినా బీమా పరిహారం అందడం లేదు. అడవి జంతువుల వల్ల జరిగే పంట నష్టాలను బీమా పరిధిలోకి తేవాలని 2017లోనే నిర్ణయించినా, రాష్ట్రం అమలు చేయడం లేదు. కేంద్రం తన వాటాగా చెల్లించాల్సిన ప్రీమియం సబ్సిడీ మొత్తాన్ని 50 శాతం నుండీ 30 శాతానికి తగ్గించుకోవడం, రైతులు బీమా పథకంలో చేరాలా వద్దా అనేది రైతుల అభీష్టానికే వదిలేయడం తదితర కారణాల వల్ల కూడా ఈ బీమా పథకాల అమలు ఆగమ్య గోచరంగా తయారయ్యింది. రైతులకు జరుగుతున్న నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2023 ఖరీఫ్ నుంచి అన్ని పంటలకూ గ్రామం యూనిట్ గా స్వంత పంటల బీమా పథకాలను అమలు చేయాలి. ఎప్పటికప్పు డు నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి పంట నష్టపరిహారాలను చెల్లించాలి.

## శీతాకాల సమావేశాల్లోనైనా మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించేనా !

వాస్తవానికి అన్ని రాజకీయ పార్టీలు...చట్టసభల్లో 1/3వ వంతు మహిళా రిజర్వేషన్ చట్టం చేస్తామని ఎన్నికల ప్రణాళికలలో, ఎన్నికల ప్రచారంలో మహిళా ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు వాగ్దానాలు చేస్తున్నాయి. ఓట్ల కోసం, రాజకీయ సభల కోసం మహిళలను ఉపయోగించుకుంటున్నాయి. పార్టీలో పదవులు, ఎన్నికల్లో సీట్లు ఇవ్వటంలో మొండిచెయ్యి చూపుతున్నాయి. సంవత్సరాలు గడిచినా రిజర్వేషన్ ఊసే ఎత్తటం లేదు. మహిళలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం పెరిగితే శాసనాలు రూపొందించడంలో, ప్రభుత్వ పాలనలో కీలక పాత్ర పోషించే వీలు కలుగుతుంది. ఇంటాబయటా నిర్ణయాధికారాలలో మహిళల స్థానం మారకుండా సమాజాభివృద్ధి జరగదని చరిత్ర చెబుతోంది. అణిచివేత నుంచి విముక్తి, స్వతంత్ర వ్యక్తిత్వం ఈ దేశంలో మహిళలకు ప్రధానమైనవి. ప్రపంచ లింగ సమానత్వ సూచీ–2022లో భారతదేశం 146 దేశాలకుగాను 135వ స్థానంలో ఉంది. అత్యధిక లింగ వివక్షత కలిగిన దేశాల్లో భారత్ ఒకటిగా ఉందని 'ప్రపంచ ఆర్థిక వేదిక' (వరల్డ్ ఎకనామిక్ ఫారమ్) గణాంకాలు చెబుతున్నాయి. ఈ దశలో మహిళలకు కావలసినది కంటితుడుపు చర్యలు కాదు. రాజకీయ రంగంతో సహా అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలి. 'మహిళల స్థాయిని చూసి ఒక దేశ పరిస్థితి ఎలా ఉందో చెప్పవచ్చు' అని ప్రథమ ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పేర్కొన్నారు. కొంతమంది మహిళలు పలు రంగాల్లో అత్యున్నత స్థానాలు అధిరోహిస్తూ ఉండవచ్చు. ఇందిరాగాంధీ భారత ప్రధానిగా రాజకీయ రంగంపై బలమైన ముద్ర వేయగలిగినప్పటికీ పురుషులతో సమాన అవకాశాలకు వచ్చేసరికి స్త్రీలు ఇప్పటికీ ఎంతో దూరంలో ఉండటం దురదృష్టకరం. లింగవివక్ష ఉండకూడదని, స్త్రీపురుష సమాన అవకాశాలను రాజ్యాంగం కల్పించింది. కానీ 75 ఏళ్ళ స్వాతంత్ర్యం తర్వాత స్త్రీల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అమ్మ కడుపులో పడినప్పటి నుంచే ఆడపిల్లను హతమార్చే కుట్ర సాగుతోంది. పురషాధిక్య సమాజంలో సామాజిక కట్టుబాట్లు, దురాచారాలు, స్త్రీల పట్ల పెనుశాపాలుగా మారుతున్నాయి. వరకట్న నిషేధ చట్టం, అత్యాచార నిరోధక చట్టం, నిర్భయ చట్టాలు వచ్చినా నేరాల సంఖ్య తగ్గకపోగా పెరుగుతున్నాయి. ఇంటాబయటా మహిళలు అభద్రతా భావంతో జీవించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. "అభివృద్ధికి గీటురాళ్ళలో రాజకీయాలలో మహిళా సాధికారిత కూడా ఒకటి. జనాభాలో సగభాగమైన మహిళలను విధాన నిర్ణయాల్లో భాగస్వాములను చేస్తేనే ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థం ఉంటుంద"ని ప్రపంచ ఆర్థిక వేదిక పేర్కొంది. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమని గొప్పలు చెప్పుకొనే మన దేశంలో మహిళా రిజర్వేషన్ బిల్లు దశాబ్దాలుగా తెరమరుగున పడింది. సగభాగంగా ఉన్న మహిళలకు చట్టసభలలో 1/3 వంతు రిజర్వేషన్లు కల్పించాలని మహిళా సంఘాలు సుదీర్ఘ కాలంగా ఉద్యమాలు నిర్వహిస్తున్నాయి. 1996 సంవత్సరంలో లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టినప్పుడు చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రభస జరిగింది. ఆర్‌జెడి, ఎస్‌పి లకు సంబంధించిన లల్లూ, ములాయం, శరద్ యాదవ్‌లు బిల్లు కాగితాలు చించివేశారు. సభ సజావుగా జరగకుండా గందరగోళం సృష్టించారు. మహిళా రిజర్వేషన్ వలన కుటుంబ జీవనం, సామాజిక సంబంధాలు దెబ్బతింటాయని బిజెపి అభ్యంతరం ప్రకటించింది. వామపక్షాలు మినహా రిజర్వేషన్ బిల్లుపై రాజకీయ పార్టీలకు ఏకాభిప్రాయం లేదని బిల్లు సెలక్ట్ కమిటీకి పంపబడింది. గీతా ముఖర్జీ నాయకత్వాన ఏర్పడిన పార్లమెంటరీ సెలక్ట్ కమిటి ఏకగ్రీవంగా యథాతథంగా బిల్లును ఆమోదించమని తెలిపింది. మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత ఏడున్నరేళ్ళలో మహిళా బిల్లు ప్రస్తావనే లేదు. మహిళా బిల్లు గురించి మోడీ బెల్లం కొట్టిన రాయిలా ఒక్క మాట కూడా మాట్లాడరు. లోక్‌సభలో ఎస్.సి, ఎస్.టి లకు రిజర్వేషన్లు ఉన్నాయి. చట్టసభల్లో ఓబిసీలకు రాజ్యాంగం ఎటువంటి రిజర్వేషన్లు కల్పించలేదు. ఈ అంశంపైన పార్లమెంట్‌లో విడిగా చర్చను చేపట్టాలి. పార్లమెంట్‌లో అలా చర్చ చెయ్యకుండా మహిళా బిల్లు ప్రవేశపెట్టినప్పుడు మాత్రం రగడ చేస్తున్నారు. వాస్తవానికి అన్ని రాజకీయ పార్టీలు...చట్టసభల్లో 1/3వ వంతు మహిళా రిజర్వేషన్ చట్టం చేస్తామని ఎన్నికల ప్రణాళికలలో, ఎన్నికల ప్రచారంలో మహిళా ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు వాగ్దానాలు చేస్తున్నాయి. ఓట్ల కోసం, రాజకీయ సభల కోసం మహిళలను ఉపయోగించుకుంటున్నాయి. పార్టీలో పదవులు, ఎన్నికల్లో సీట్లు ఇవ్వటంలో మొండిచెయ్యి చూపుతున్నాయి. సంవత్సరాలు గడిచినా రిజర్వేషన్ ఊసే ఎత్తటం లేదు. మహిళలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం పెరిగితే శాసనాలు రూపొందించడంలో, ప్రభుత్వ పాలనలో కీలక పాత్ర పోషించే వీలు కలుగుతుంది. మహిళలు వంటింటికి, పిల్లల్ని కని పెంచటానికి, కుటుంబ ఆలనా పాలనా బాధ్యత వహించాలని...అంతవరకే పరిమితం కావాలనే మనువాద సిద్ధాంతకర్తల ఏలుబడిలో బిల్లుకి మోక్షం కలగదు. పైగా తమ రాజకీయ గుత్తాధిపత్యానికి బీటలు పడతాయనే భయం పాలక వర్గ రాజకీయ పార్టీలలో ఉంది. అనేక ప్రజా వ్యతిరేక బిల్లులు ఏకపక్షంగా ఆమోదింపచేసుకునే పాలక పార్టీలు మహిళా బిల్లును మాత్రం ఏకాభిప్రాయం పేరుతో సంవత్సరాల తరబడి పెండింగ్ పెడుతున్నాయి. రాజ్యసభలో ఆమోదం పొందిన మహిళా బిల్లు గత 12 ఏళ్ళుగా పార్లమెంట్ గోడలకు వేలాడుతోంది. మనకన్నా వెనుకబడిన రువాండా, టాంజానియా, ఉగాండా, ట్యునీషియా, దక్షిణ సూడాన్ వంటి ఆఫ్రికా దేశాలే కాదు. మన పొరుగున ఉన్న పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్ వంటి దేశాల చట్టసభల్లో మనకన్నా మహిళల సంఖ్య మెరుగ్గా ఉంది. దేశ జనాభాలో సగభాగం మహిళలు ఆ మేరకు రాజకీయ రంగంతో సహా అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలి. కానీ చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లకు ఉద్దేశించిన బిల్లునే గట్టెక్కించలేక మూలనపడేసిన ఘనత మన నాయకులది. మహిళలు సాధికారిత సాధించారని ఎవరెన్ని కబుర్లు చెప్పినా వాస్తవ పరిస్థితులు అపహాస్యం చేస్తున్నాయి. ఉన్నత పదవుల్లో ఉన్న రాష్ట్రపతి, ఒకరిద్దరు మంత్రులను చూపించి మహిళలందరూ సాధికారిత సాధించారని ప్రచారం చేస్తున్నారు. మహిళలు సుదీర్ఘ పోరాటాల ఫలితంగా ఓటుహక్కు సాధించుకున్నారు. 1962 నుండి 2014 వరకు పాలనలో మహిళా ఓట్ల శాతం పెరుగుతూ వచ్చింది. పాలనలో మహిళల భాగస్వామ్యం కొరకు జరిగిన ఉద్యమాల ఫలితంగా 73, 74 రాజ్యాంగ సవరణ ద్వారా వచ్చిన రిజర్వేషన్లను వినియోగించుకొని స్థానిక సంస్థల్లో మహిళలు 14 లక్షల మంది పాలన సాగిస్తున్నారు. ఎన్నికైన మహిళా ప్రతినిధులను పక్కన పెట్టి వారికి బదులుగా భర్త లేదా కుటుంబ సభ్యులే అన్ని వ్యవహారాలూ చక్కబెడుతున్నారు. భారత రాజ్యాంగం ఏం చెప్తోంది? చట్టం ముందు అందరూ సమానులే. కుల, మత, లింగ ప్రాంతాల పేరుతో వివక్ష నిషేధం... అని 14,15 అధికరణాలు చెప్తున్నాయి. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన పాలకులు రాజ్యాంగ హక్కులు కాలరాస్తున్నారు. మహిళా సాధికారిక కనుచూపుమేరలో కనిపించటంలేదు.

# రక్తదానం పట్ల యువతకు అవగాహన కలిగించండి: నిమ్మకాయల రాజనారాయణ



సత్తెనపల్లి: ప్రజాపాలన"రక్తదానం చేద్దాం జగనన్నకి శుభాకాంక్షలు తెలియజేద్దాం'' అనే వినూత్న కార్యక్రమంతో రాష్ట్ర జలవనరుల శాఖామాత్యులు అంబటి రాంబాబు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్ జన్మదిన వేడుకలను సరికొత్తగా నిర్వహించనున్నారు. గత ఏడాది లాగానే ఈ సంవత్సరం కూడా ముఖ్యమంత్రి జన్మదినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని భారీగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని కౌన్సిలర్లు, ప్రజా నాయకులతో సన్నాహక సమావేశం గురువారం నియోజకవర్గ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ నాయకులు చల్లంచర్ల సాంబశివ రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ రక్తదానం చేసిన వారికి ప్రత్యేక ధ్రువీకరణ పత్రం అందిస్తున్నామని వివరించారు. రక్తదానంపై అవగాహన కలిగించి రక్తదాన దాతలను తీసు కొచ్చే బాధ్యత నాయకులదేనన్నారు. గత ఏడాది కంటే అధిక సంఖ్యలో రక్త దాతలను సమీకరించుకోవాలన్నారు.

పండుగలా రూ.2,750 ల పింఛన్ల పంపిణీ

నూతన సంవత్సరం జనవరి ఒకటో తేదీన సత్తెనపల్లిలో ఒక వార్డు ను ఎంపిక చేసుకొని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటూ మాట తప్పకుండా, మడమ తిప్పకుండా రూ. 2500 ల పెన్షన్ను రూ. 2750 ల కు పెంచుతూ ఇస్తున్న పింఛన్ ను పంపిణీ చేద్దామన్నారు. ఆయా మండలాల్లో నాయకులకు కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. వార్డులో ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు పింఛన్ల పంపిణీ జరుగుతుందని.. అందరు పాల్గొనాలని ఆయన వివరించారు.ప్రతి ఏడాది లాగానే ఈ ఏడాది కూడా సంక్రాంతి పండుగను పరిష్కరించుకొని నియోజకవర్గస్థాయి వైయస్సార్ సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. మొదటి బహుమతి రూ.2 లక్షలు రెండో బహుమతి, రూ.1 లక్ష, మూడు ,నాలుగు ,5 వ స్థానాలకు కూడా బహమతులు అందిస్తున్నామని వివరించారు. ముగింపు వేడుకల్లో పాల్గొనే వారికి లాటరీ ద్వారా ఆకర్షణీయమైన బహుమతి కూడా ఉందన్నారు. వరసగా జరిగే కార్యక్రమాలు అన్నిటికి నాయకులు, పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారుఅలాగే నియోజకవర్గంలో ప్రతి సచివాలయానికి పార్టీ తరపున ఒక వాలంటీర్ను,, ప్రతి క్లస్టర్ పరిధిలో ఇద్దరు గృహ సారథులను ఎంపిక చేయాలన్నారు. ఈ ఎంపికలు నామమాత్రం కాదని కష్టపడి పని చేసే వారిని గుర్తించి వారిని ప్రోత్సహించాలని సూచించారు . కార్యక్రమంలో ముందుగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ పితామహుడు అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి ని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్, ఉమెన్స్ డెవలప్మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ గీత హసంతి, డాక్టర్ గజ్జల నాగభూషణ్ రెడ్డి, అచ్యుత శివప్రసాద్, వెలుగూరి శరత్, పెండం బాబురావు, యఽానస్, కౌన్సిలర్లు, ఇతర నాయకులు ఉన్నారు.

## ఎమ్మెల్యే మొండితోక జగన్ ఎమ్మెల్సీ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో గ్రాండ్ సెమీ క్రిస్మస్ వేడుకలు ముఖ్య అతిథిగా వైయస్ రాజశేఖర్ రెడ్డి సోదరి వైయస్ విమలమ్మ





నందిగామ డిసెంబర్ 15 ప్రజాపాలన ప్రతినిధినియోజకవర్గ పరిధిలో స్థానిక ఎమ్మెల్యే మోడీతో ఒక జగన్మోహన్ ఎమ్మెల్సీ అరుణ్ కుమార్ వారి తల్లి మరి యమ్మ జ్ఞాపకార్థం గ్రాండ్ సెమీ క్రిస్మస్ వేడుకలు ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికిముఖ్య అతిథిగా వై యస్ రాజశేఖర్ రెడ్డి సోదరి వైయస్ విమలమ్మ హా జరైనారు.ఈ కార్యక్రమంలో భాగంగానియోజక వర్గం లోని దైవ సేవకులకు నూతన వస్త్రాలను పంపిణీ చే శారు పట్టణంలో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు సొంత నిధులతో నిర్మించనున్న క్రిస్టి యన్ కమ్యూనిటీ హాల్ భవనానికి వైఎస్ విమలమ్మశంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూలోక రక్షకుడైన యేసు మానవాళి పాపాలు తొలగించేందుకు భూమి పైకి వచ్చి సమస్త ప్రాణులపై అం తులేని ప్రేమను చూపిన కరుణామయుడు ప్రభు యే సు అన్నారు ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభు యేసు చె ప్పినట్టు నిన్ను వలె నీ పొ రుగు వారిని ప్రేమించు అనే వాక్యాన్ని అనుసరిస్తూ ప్రజలను అమితంగా ప్రేమిం చే వ్యక్తి ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డ న్నారుఈ కార్యక్రమంలో ప్రసంగికులు మొండితోక శాంత కుమారి ,సుధా , మట్టా రమేష్ ,దైవ సేవకులు జార్జి ముల్లర్ ,పాల్ శివశంకర్ రెడ్డి , హనోకు , జేడిఎం ఎం ప్రసాద్ ,తదితరులు పాల్గొన్నారు

## జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కౌలు రైతు భరోసా యాత్రను విజయవంతం చేయండి: రాష్ట్ర కార్యదర్శి బోడె బోయిన శ్రీనివాస్ యాదవ్



సత్తెనపల్లి ప్రజాపాలన కౌలు రైతు భరోసా యాత్రలో భాగంగా ఈనెల 18న ఆదివారం సత్తెనపల్లి నియోజకవర్గంలోని ధూళిపాళ్ల గ్రామంలో జరిగే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి బోడే బోయిన శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు ఉమ్మడి గుంటూరు జిల్లాలో మృతి చెందిన 300 మంది కౌలు రైతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు చెక్కును అందజేయనున్నట్లు వారు తెలిపారు

## పైప్ లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన



జగ్గయ్యపేట డిసెంబర్ 15 ప్రజాపాలన ప్రతినిధి: పట్ట ణంలోని 31 వ వార్డు పుట్టబజార్ నందు పైప్ లైన్ ని ర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో నియో జకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన నాయకు లు శ్రీ సామినేని వెంకట కృష్ణ ప్రసాద్,మున్సిపల్ చైర్మ న్ శ్రీరంగాపురం రాఘవేంద్ర పాల్గొన్నారుఈ సంద ర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ చాలా ఏళ్లుగా ఈ ప్రాం తంలో మంచినీటి వ్యవస్థ సరిగా లేదని కౌన్సిలర్ గిం జుపల్లి వెంకటరావు గారి ద్వారా తెలియడంతో పైపుల నిర్మాణ పనులకు ఈరోజు శంకుస్థాపన కార్యక్ర మంలో పాల్గొనడం జరిగిందని వీలైనంత త్వరగా ఇ క్కడ ప్రజలకు మంచినీటి సదుపాయం అందిస్తామని తెలియజేశారుఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కృష్ణా జలాలు సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామ ని సరిగ్గా వారం రోజుల క్రితమే కోటి 25 లక్షల రూపా యల వ్యయంతో రిజర్వాయర్ల నిర్మాణానికి కూడా గౌరవనీయులు శాసనసభ్యులు సామినేని ఉదయ భాను చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం జరి గిందని త్వరలోనే టాంక్ నిర్మాణం పూర్తి చేసి ప్రజల కు పూర్తి స్థాయి మంచినీటి సరఫరా అందించేలా కృషి చేస్తామని తెలియజేశారుఈ కార్యక్రమంలో ము న్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ కౌన్సిలర్లు గిం జుపల్లి వెంకట్రావు గారు వట్టెం మనోహర్ పందుల రో శయ్య పట్టణ వైఎస్ఆర్సిపి యువజన విభాగా అధ్య క్షులు భవాని ప్రసాద్ వైఎస్ఆర్సిపి నాయకులు ఫిరో జ్ ఖాన్ గింజుపల్లి కృష్ణ తదితరులుపాల్గొన్నారు

## బండలాగుడు పోటీలను ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



నందిగామ డిసెంబర్ 15 ప్రజాపాలన ప్రతినిధి:విశ్వ విఖ్యాత నటసార్వభౌముడు తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు శతజయంతి వేడుకల్లో భాగంగా తెదేపా నేతలు, రైతులతో కలసి జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బల ప్రదర్శన (బండలాగుడు) పోటీలను మాజీ శాసనసభ్యురాల తంగిరాల సౌమ్య ప్రారంభించారు ఒంగోలు జాతి ఎద్దులతో బరిలో దిగిన రైతులతో మా ట్లాడి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయన శతజయంతి ఉత్సవాల సందర్భంగా సాంప్రదాయంగా వస్తున్నటువంటి ఎద్దు ల పోటీలు నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. ఐదు రోజులపాటు జరగనున్న ఎద్దుల పోటీల్లో మొ దటి రోజు పాలపళ్ళ పోటీల విభాగంలో ఎద్దులను బ రిలోకి దించామన్నారుఈ కార్యక్రమంలో రైతులు, తె దేపా నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించినవేగేశన నరేంద్ర వర్మ



బాపట్ల జిల్లా ప్రజాపాలన డిసెంబర్ 15ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా బాపట్ల ప్రభుత్వ ఆసుపత్రి వద్ద గల ఆ మహనీయుని విగ్రహానికి తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జ్ వేగేశన నరేంద్ర వర్మ .ఈ సందర్భంగా మాట్లాడిన నరేంద్ర వర్మనాటి సామాజిక పరిస్థితుల లో తెలుగు వారి పట్ల జరుగుతున్న అన్యాయాలను, వివక్షను ఎదిరించి తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని పోరాడి సాధించిన వ్యక్తి స్వర్గీయ పొట్టి శ్రీరాములు .ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం తన ప్రాణాన్ని సైతం తృణప్రాయంగా త్యాగం చేసిన మహనీయులు పొట్టి శ్రీరాములు . పొట్టి శ్రీరాములు జీవితం భవిష్యత్ తరాలకు ఆదర్శం. తెలుగు జాతి ఉన్నంత వరకు వారి త్యాగం తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటుంది. ఈరోజు వారి వర్ధంతి సందర్భంగా వారి త్యాగాన్ని స్మరించుకొంటూ నివాళులు అర్పించడం మన బాధ్యత. వారి అడుగుజాడల్లో నడుస్తూ వారి ఆశయసాధన కు కృషి చేద్దామని నరేంద్ర వర్మ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు గొల్లపల శ్రీనివాసరావు, వీరయ్య నాయుడు,బుర్లే రామ సుబ్బారావు, సూరగాని శేఖర్, పరిశా రమేష్ గౌడ్, వడ్లమూడి వెంకటేశ్వరరావు, హరికృష్ణ గౌడ్, షాఖా, ఛార్లెస్,యోనా, దారా అశోక్, మస్తాన్ వలి, అబ్రార్, రాంబాబు, జీవన్, సత్యనారాయణ,సూరజ్, సలగల రాజా,పల్లం సరోజిని, హైమావతి, రాణి,తదితరులు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఘనంగా అమరజీవీ పొట్టిశ్రీరాములు వర్ధంతి వేడుకలు



కారంపూడి..డిసెంబర్15...ప్రజాపాలన.. ప్రతినిధి :పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్లో అమరజీవి పొట్టిశ్రీరాములు 70వ వర్ధంతి వేడుకలు స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగాయి. పొట్టిశ్రీరాములు విగ్రహానికి గాంధీ విగ్రహానికి వాసవికన్యాకాపరమేశ్వరి దేవస్థానం అధ్యక్షులు చితిరాల. వెంకటకోటేశ్వరరావు, నాగరేశ్వరస్వామి ధర్మకర్త మిత్తింటి. సాంబశివరావు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వెలుగురి. శ్రీనివాసరావు, కారంపూడి పంచాయతీ ఉపసర్పంచ్ సురే. అంకారావు లు పొట్టిశ్రీరాములు, మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం పొట్టిశ్రీరాములు చేసిన త్యాగాన్ని ఈ సందర్భంగా వారు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో గుండా. శ్రీనివాసరావు, యక్కల. శ్రీనివాసరావు, కజం పెద్ద ఆంజనేయులు బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్య కమిటీ చైర్మన్ ఆతుకూరి. గోపి, ఆర్యవైశ్య సంఘం నాయకులు కొత్త. బ్రహ్మేశ్వరరావు, కొమ్మూరి రామారావు కలవల శ్రీనివాసరావు సచివాలయ కన్వీనర్ సురే. సుబ్రహ్మణ్యం, చెన్నకేశవ ట్రస్ట్ బోర్డు మెంబెర్ పొట్టు మూర్తి అమరలింగేశ్వరరావు, కజ్జం. ప్రసాద్, గర్రె. రామారావు, కొల్లా సాంబయ్య వుటుకూరి. రాము, తదితర ఆర్యవైశ్య సంఘం ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

## వాసవి సేవాదళ్ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు



కారంపూడి..డిసెంబర్15...ప్రజాపాలన... ప్రతినిధి... పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్లో ఏర్పాటుచేసిన పొట్టి శ్రీరాములు విగ్రహానికి మరియు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన వాసవి సేవాదళ్ సభ్యులు వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు స్మరించుకున్నారు ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా వాసవి సేవాదళ్ అధ్యక్షులు భవిరిశెట్టి రామారావు ప్రధాన కార్యదర్శి గుండా వెంకట ఉమా మహేశ్వరరావు కోశాధికారి కొత్త మాస్ వెంకట రామ్మోహన్ రావు జాయింట్ సెక్రెటరీ సురే ఆంజనేయులు ఉపాధ్యక్షులు చలువాది మాధవరావు సన్నిధి జగన్మోహన్రావు జిల్లా సంఘం ఆర్గనైజర్ ముచ్చర్ల రామ కోటేశ్వరరావు కారంపూడి మండల ఆర్య సంఘం అధ్యక్షులు వెలుగురి శ్రీనివాసరావు విద్యా కమిటీ చైర్మన్ ఆతుకూరి గోపి కజ%శీ% హనుమంతరావు కలవల మని తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు వెన్నుముకగా సొసైటీలు: ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను





పెనుగంచిప్రోలుడిసెంబర్ 15 ప్రజాపాలన ప్రతినిధి: పెనుగంచిప్రోలు మండలం గుమ్మడిదూరు గ్రామంలో 22 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన ప్రా థమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూత న భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅ తిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వవిప్ నియోజకవర్గ శాసనసభ సభ్యులు సామినేని ఉదయభానుపాల్గొ న్నారుఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వ్యవసాయంతో పాటు అన్ని సహకార రంగాలను అభివృద్ధి చేస్తున్నా రని తెలిపారు,రైతులకు విత్తనం మొదలు విక్రయం వరకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి అన్ని రకాల సేవలను అందిస్తున్నారని అన్నారు, అదేవిధం గా నేడు మన రాష్ట్రంలో గ్రామ సచివాలయుల ద్వా రా ప్రజలకు మరింత సేవలను అందిస్తున్నామని తె లిపారు,ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో రా ష్ట్రం సుభిక్షంగా ఉందని తెలిపారుఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు,డైరెక్టర్ కొమ్మినేని రవిశంకర్, రాష్ట్రమైనింగ్ కార్పొరేషన్ డైరెక్ట ర్ బత్తుల రామారావు, గ్రామ సర్పంచ్ నక్క కమ ల,, లగడపాటి నాగేశ్వరరావు,లగడపాటి వీరయ్య,వివిధ గ్రామాల సొసైటీ అధ్యక్షులు,ముఖ్యనాయకు లు,అ ధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదిన వారోత్సవాలు



ప్రజాపాలన న్యూస్ ఏర్పేడు ప్రతినిధి శుక్రవారం ఉదయం 10గంటలకు ఏర్పేడు మండలం కేంద్రంలో ప్రియతమ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి దిశంబర్ 21వ తేదీన 50 సంవత్సారాలు జన్మదినము పురస్కరించుకుని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదిన వారోత్సవాలు మొదలైన సందర్భంగా రేపు శుక్రవారం ఉదయం ఏర్పేడు లోని శివ పబ్లిక్ స్కూల్ లో రక్తదాన శిబిరం జరుగును . వైఎస్సార్ సిపి కార్యకర్తలు అందరూ పాల్గొనాల్సిందిగా, ఏర్పేడు మండలం ఇంఛార్జి గన్నేరు. కిషోర్ రెడ్డి పిలుపు నిచ్చారు.మరియు ఏర్పేడు సర్పంచ్ శివయ్య గారు కూడా శిబిరంలో పాల్గొంటారని గ్రామ ప్రజలకు కూడా పిలుపునిచ్చారు.



## స్వర్ణాంధ్రలో బ్లడ్ గ్రూపింగ్ కార్యక్రమం



నరసాపురం, డిసెంబర్ 15 (ప్రజాపాలన ప్రతినిధి) : ప్రతీ ఒక్కరూ తమ రక్తం యొక్క గ్రూపును గురించి తెలుసుకోవాలని స్వరాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలల చైర్మన్ కేవీ సత్యనారాయణ అన్నారు. మండలంలోని సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్, ఆచరణలు సంయుక్తంగా బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కె.వి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు విధిగా తమ బ్లడ్ గ్రూపు గురించి తెలుసుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సురేష్ కుమార్, కళాశాల డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, కోశాధికా కె. త్రినాథస్వామి, ప్రతాప్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.మాణిక్యాలరావు పాల్గొన్నారు.

### తాళ్లరేవులో గడప-గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్



తాళ్ళరేవు డిసెంబర్ 15 ప్రజాపాలన ప్రతినిధి.: కాకినాడ జిల్లా ముమ్మిడి వరం నియోజకవర్గం తాళ్ళరేవు మండలం తాళ్ళరేవు గ్రామం సచివాలయం 1 పరిధిలో2 గురువారం గడప-గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముమ్మిడివరం స్థానిక ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్ కొనసాగించారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు, అభిమానులు సర్పంచులు ఎంపీటీసీలు డైరెక్టర్లు వాలంటీర్లు అధికారులు అధిక సంఖ్యలో ఎమ్మెల్యే తో కలిసి ఇంటింటికి వెళ్లి జగనన్న ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను వివరిస్తూ వారి సమస్యలను తెలుసుకుంటున్నారు.

## డిబిఆర్సి ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు అందజేత



సత్తెనపల్లి ప్రజాపాలన ప్రతినిధి: 15-12-2022 దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో మండల కేంద్రమైన ముప్పాళ్ళ జడ్పీహెచ్ఎస్ స్కూల్ నందు రాజ్యాంగ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగానికి సంబంధించిన ప్రశ్నలతో 8 ,9, 10, చదువుతున్న విద్యార్థులకు వ్యాసరచన క్విజ్ పోటీలు నిర్వహించడం జరిగింది గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్ల బహుమతులు అలాగే స్కూల్ కి మూమెంట్ అందజేయడం జరిగింది నీ దళిత బహుజన రిసోర్సెంటర్ కోఆర్డినేటర్ మే డే వెంకటరమణ తెలియజేశారు ఈ సందర్భంగా హెచ్ఎం వి పార్వతీ మాట్లాడుతూ విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రతి విద్యార్థి క్రమశిక్షణ విద్య క్రీడలు సామాజిక అంశాలపై ప్రాథమిక స్థాయి నుంచి పోటీ తత్వంతో అవగాహన కలిగి కులమత బేధ తేడాలు లేకుండా విద్యార్థులు కలిసిమెలిసి ఉండాలని సూచించారు ఏపిఎం బాలస్వామి మాట్లాడుతూ విద్యతోపాటు రాజ్యాంగ అంశాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండటాన్ని అభినందించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

## వృద్ధులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ



నరసాపురం, డిసెంబర్ 15 (ప్రజాపాలన ప్రతినిధి) : నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ పొత్తూరి రామరాజు పుట్టినరోజు సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు భూపతి బాబ్జీ, సెక్రటరీ నడింపల్లి విజయకుమార్ రాజు అధ్వర్యంలో పట్టణంలోని బొండమ్మ వృద్ధ ఆశ్రమంలో వృద్ధులకు, పేదలకు పండ్లు, దుప్పట్లు, భోజనం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు బర్రె మురళి, మండల తెలుగు యువత అధ్యక్షు%ఎబ్% దొంగ మురళి, మొగల్తూరు మండల తెలుగు యువత అధ్యక్షుడు బొక్కా లక్ష్మణరావు, మండల ఐటిడిపి అధ్యక్షుడు జక్కంశెట్టి బాలాజీ, కొలపర్తి శివకృష్ణ, ముడాల రామచంద్రరావు, కె. సాల్మన్, జి. ఏసు, బి. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు భారత రాజ్యాంగ ఆవశ్యకత గురించి తెలుసుకోవాలి



సత్తెనపల్లి ప్రజాపాలన ప్రతినిధి: సత్తెనపల్లి :భారత రాజ్యాంగంలోని రాజ్యాంగ పీఠిక,ప్రాథమిక హక్కులు, అదేశికసూత్రాలు ద్వారా ప్రతి పౌరునికి కుల, మత, లింగ, ప్రాంతం, భాష వివక్ష లేకుండా స్వేచ్ఛ, సమానత్వం, సోదరత్వం, సమన్యాయం కల్పించుట భారత రాజ్యాంగం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ ఫేర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ చిలుక జయ లక్ష్మి అన్నారు. గురువారం సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంబాలికల గురుకుల పాఠశాల దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీలలో గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు మరియు పాఠశాలకు ప్రత్యేక బహుమతి ఇవ్వడం జరిగిందని,విద్యార్థులు భారత రాజ్యాంగం గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత ఉందని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప వివరించారు. ఉపాధ్యాయురాలు బండి సంపూర్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య హక్కు చట్టం ద్వారా పిల్లలందరూ చదువుకోవడానికి అవకాశం కల్పించిందని అదేవిధంగా 14 సంవత్సరాల లోపు పిల్లలందరూ బడిలో ఉండాలని ఉన్నతమైన విద్యను అందించేందుకు నాడు నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో వసతులు మెరుగుపరిచి అన్ని రకాల క్వాలిటీ ఎడ్యుకేషన్ అందించేందుకు చాలా కృషి చేస్తుందని దీనిని పేద బడుగు బలహీన వర్గాల పిల్లలందరూ చేసుకొని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలు కనుగొనంగా ఉన్నతమైన స్థాయికి ఎదగాలని ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి. లక్ష్మి మోహిని, సి హెచ్. కవిత, బండి సంపూర్ణ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## గడప-గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్





పి. గన్నవరం డిసెంబర్ 14 ప్రజాపాలన ప్రతినిధి.:గడప-గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈరోజు బుధవారం పి. గన్నవరం గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే తో జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు పాల్గొన్నారు. బుధవారం పి. గన్నవరంనియోజకవర్గం పి.గన్నవరం గ్రామంలో శాసన సభ్యులు కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన గడప-గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించే లక్ష్యంగా సీఎం జగన్ ప్రయాణిస్తున్నారని సంక్షేమ పథకాలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం వై. యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయుకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు వాలంటీర్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బాలుడుకి ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ నుండి రూ.2.60 లక్షలు మంజూరు. సిఫారసు చేసిన జిల్లా కలెక్టర్



అమలాపురం డిసెంబర్ ప్రజాపాలన ప్రతినిధి. అంబేద్కర్ కోనసీమ జిల్లా, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సిఫారసు ద్వారా ఆదిమూలపు జానకిరామ్ కు ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ నుండి రూ. 2.60 లక్షలు మంజూరు అయింది. వివరాలు లోకి వెళితే పి. గన్నవరం మండలం ఉడుముడి కి చెందిన ఆదిమూలపు సీతారామయ్య పాండురంగ దంపతుల 12 సంవత్సరాల కుమారుడు ఆదిమూలపు జానకిరామ్ కు ఉన్న వినికిడి లోపాన్ని సరిదిద్దేందుకు ఇన్ ప్లాంటేషన్ చికిత్స, పరికరం ఏర్పాటు ఆరోగ్యశ్రీ పరిధిలోనికి రానందున ముఖ్యమంత్రివర్యులు రిలీఫ్ ఫండ్ నుండి రూ. 2.60 లక్షలు మంజూరు చేయించి ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ రాధాకృష్ణ సమన్వ యంతో ఇటీవల ఈ చికిత్సలు విజయవాడలోని మణిపాల్ హాస్పిటల్ లో చేయించిన పిదప జానకిరామ్ తల్లిదండ్రులతో గురువారం స్థానిక కలెక్టరేట్లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ నందు కలిసి వైద్య సహాయం అందించినందుకు గాను కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడు తూ బాలుడు విద్య పట్ల ఆసక్తిని పెంపొందించుకొని పోటీ ప్రపంచంలో రాణించే విధంగా విద్యాబుద్ధులు నేర్చుకోవాలని ఆ దిశగా తల్లిదం డ్రులు ప్రోత్సాహాన్ని అందించాలని సూచించారు. కుమారుడికి విద్య వైద్య పరంగా భవిష్యత్తులో ఏ విధమైన సహకారం కావలసిన తనను సంప్రదించిన ఎడల ప్రభుత్వపరంగా సహాయం అందిస్తామని కుమారుడు తల్లిదండ్రులకు జిల్లా కలెక్టర్ భరోసానిచ్చా రు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, జిల్లా సమాచార పౌర సంబంధాలు అధికారి కె. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములు:కలెక్టర్ హిమాన్షు శుక్లా



అమలాపురం డిసెంబర్ ప్రజాపాలన ప్రతినిధి: అమరజీవి పొట్టి శ్రీరాములు వంటి మహనీయుల ఆశయాలను త్రికరణ శుద్ధిగా ఆచరించడమే వారికి అర్పించే ఘనమైన నివాళి అని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నా రు. గురువారం అమరి జీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక కలెక్టరేట్ నందు అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు అలంకరించి పుష్ప గుచ్ఛాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించి , అమరజీవి అయిన మహాపురుషుడు, పొట్టి శ్రీరాములు గారి వర్ధంతి రోజున ఆయనను స్మరించుకోవడం మన బాధ్యతని సూచించారు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడైనవాడని, మహాత్మా గాంధీ బోధించిన సత్య%శీ%, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కొరకు జీవితాంతం కృషిచేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు 1901 మార్చి 16న మద్రాసులో జన్మించాడన్నారు. సబర్మతి ఆశ్రమంలో శ్రీరాములు సేవ చరిత్రాత్మక మైనదని ప్రేమ, వినయం, సేవ, నిస్వార్థతలు మూర్తీభవించిన స్వరూపవమే పొట్టి శ్రీరాములని. ఆంధ్రోద్యమంపై అతనికున్న దృఢత్వంఅచె%శీ%చలమైనదన్నారు. మద్రాసు రాజధానిగా వుండే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు మద్రాసులో 1952 అక్టోబర్ 19న బులుసు సాంబమూర్తి ఇంట్లో నిరాహారదీక్ష ప్రారంభించారని. చాలా మామూలుగా ప్రారంభమైన దీక్ష తీవ్రతరమై 1952 డిసెంబర్ 15 అర్ధరాత్రి పొట్టి శ్రీరాములు,తన ఆశయసాధనలో ప్రాణాలర్పించి అమరజీవి అయ్యా డని ఆయన త్యాగనిరతిని కొనియాడారు. చివరకు పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం తనను తాను త్యాగం చేసి అమరజీవిగా నిలిచాడన్నారు. తెలుగు మాట్లాడే ప్రజలకు ప్రత్యేక రాష్ట్రం కోరుతూ మహనీయుడు పొట్టి శ్రీరాములు చేసిన పోరాటం నిరుపమానమై నదన్నారు. మహాత్మా గాంధీ అనుచరుడిగా గాంధేయ మార్గంలో ఆయన 56 రోజుల పాటు నిరాహార దీక్ష చేసి అమరులైయ్యా రని, ఆయన మరణించిన కొన్ని దినాలకే అప్పటి ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ భాషాప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పాటును ప్రకటిం చారన్నారు. పొట్టి శ్రీరాములు నిస్వార్థ ఆత్మ త్యాగంతో 1953 అక్టోబరు 1 వ తేదీన కర్నూలు రాజధానిగాను, తదుపరి తెలుగు భాష మాట్లాడే ప్రాంతలను కలిపి 1956 నవంబరు 1వ తేదీ నుండి హైదరాబాదు రాజధానిగాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఆవిర్భవిం చిందన్నారు. తెలుగుఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, డిఆర్ఓ సిహెచ్ సత్తిబాబు కలెక్టరేట్,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జనసేన బలోపేతానికి కృషి చేయాలి



ఉండి, డిసెంబర్ 15 (ప్రజాపాలన ప్రతినిధి) :జనసేన పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్చార్జ్ జుత్తుగ నాగరాజు, కాళ్ళ మండల పార్టీ అధ్యక్షుడు ఏరుబండి రామాంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం కాళ్ల మండలం వేంపాడు, పెదమీరం గ్రామాల జనసేన నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేంపాడు గ్రామ అధ్యక్షుడిగా చిట్టూరి వెంకటేష్, పెదమీరం గ్రామ అధ్యక్షుడిగా కొండేటి జయ మరియు గ్రామ కమిటీ సభ్యులను నియమించారు. ఈ సందర్భంగా జుత్తుగ నాగరాజు మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. నూతన కమిటీ సభ్యులు నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి కృషి చెయ్యాలని రానున్న 2024 ఎన్నికల్లో జనసేన పార్టీని గెలిపించి పవన్ కళ్యాణ్ ను అధికారం లోకి తీసుకురావటానికి కృషి చేయాలని దానికి తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. ప్రజలకు, కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటూ ఏ సమస్య వచ్చిన అండగా ఉంటామని దానికి జనసేన సైనికులు సహకారం అందించాలని నాగరాజు కోరారు. ఈ కార్యక్రమంలో కాళ్ళ మండల ఉపాధ్యక్షులు ఓగిరాల రాజేష్, గడి రాము, ప్రధాన కార్యదర్శి ఇర్రింకి జగన్, కార్యదర్శులు సాలా ప్రభుదాస్, అరిటాకుల సత్యనారాయణ, కర్రే కిషోర్, రావూరి అనిల్, గ్రామాధ్యక్షులు బండారు సోమేశ్వరరావు, లంకా సురేష్, అరేటి సందీప్, ప్రసాద్,కట్టా సతీష్, నిమ్మల పెద్దకాపు, గ్రామ కమిటీ సభ్యులు, జనసేన పార్టీ నాయకులు, కార్యక్రకర్తలు పాల్గొన్నారు.

## అమరజీవి త్యాగం అందరికీ ఆదర్శనీయం...బండారు



కొత్తపేట డిసెంబర్ 15 ప్రజాపాలన ప్రతినిధి.:అమరజీవి పొట్టి శ్రీరాములు గారి వర్ధంతి సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు,కొత్తపేట నియోజకవర్గ టిడిపి ఇంఛార్జ్ బండారు సత్యానందరావు కొత్తపేట మండలం వాడపాలెం గ్రామం బజారు వీధిలో గల శ్రీరాములు విగ్రహానికి ఈ గురువారం పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ..ఆ మహనీయుని వర్ధంతి కార్యక్రమంలో పాలు పంచుకోవడం గర్వంగా వుందని తెలుగు వారి కోసం,తెలుగు జాతి కోసం భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేయాలని 58 రోజుల పాటు చేసిన ఆమరణ దీక్ష తెలుగువారంతా కలిసుండాలని పోరాటం స్ఫూర్తిదాయకమని అన్నారు. మద్రాసులో తెలుగు వారిపై వివక్షను తట్టుకోలేక నా ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్ర అందించాలని చేసిన ప్రాణత్యాగం నేడు మన ఆంధ్రుల రాష్ట్రమని గుర్తుచేశారు. శ్రీరాములు వంటి వారు మరో పదిమంది వుండుంటే మనకి స్వాతంత్ర్యం ఇంకా ముందే వచ్చుండేదని గాంధీజీ గారే పలు సందర్భాలలో శ్రీరాములు సాధించాలనే పట్టుదల, తపన,కృషి గురించి వివరించారని తెలియజేశారు. హరిజనోద్ధరణకు యనలేని కృషి చేసి హరిజనులకు దేవాలయం ప్రవేశం కోసం పాటుపడిన వ్యక్తిని నేడు మనందరం స్మరించుకోవడం మన అదృష్టమని అన్నారు. శ్రీరాములు గారి పోరాట పఠిమను,స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని,వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్ళడం మనందరి విధి, భాద్యతగా స్వీకరించాలని బండారు సత్యానందరావు కోరారు. ఈ కార్యక్రమంలో చీకట్ల అబ్బు, బండారు బులితాత, కుడుపూడి గోవిందు, చోడపనీడి భాస్కరావు, బండారు వీరబాబు, శ్రీఘాకొల్లపు బంగారం, పాలంగి ఆశీర్వాదం, బండారు రాజేష్, గుత్తుల ధనరాజు, పప్పుల బుజ్జి, గాది శ్రీనివాస్, వరగన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా అయ్యప్ప ఇరుముడి మహోత్సవం



కంచికచర్ల డిసెంబర్ 15 ప్రజాపాలన ప్రతినిధి: నలభై ఒకరోజు లు పూర్తి చేసుకున్న అయ్యప్ప దీక్ష స్వాము లు శబరిమలై అయ్యప్ప స్వామి సన్నిధానానికి తర లివెళ్లే స్వాములకు గురువారం మండల పరిధిలోని కీ సర ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో కేరళ నం బూద్రి పప్పా స్వామి అధ్యక్షతన వైభవంగా ఇరుము డి కార్యక్రమం నిర్వహించారు తదనంతరంఅయ్యప్ప స్వాములు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం గావిం చార ఈ ఇరుముడి కార్యక్రమంలో యర్రగొర్ల. రామ కృష్ణ, నాగేంద్ర, శివ,నాని, గౌతమ్, రామకృష్ణ, అనిల్ కుమార్, తిరపయ్య, నరసింహారావు, ఆదినారాయ ణ, మణికంఠ, తదితర స్వాములు పాల్గొన్నారు

## ఇలా సైలెంట్ గా ఉంటే ఎలా సీత?



'సీతారామం'లో సీత పాత్రతో మరాఠీ బ్యూటీ మృణాల్ ఠాకూర్ తెలుగు ప్రేక్షకులకు ఎంతగా కనెక్ట్ అయ్యిందో చెప్పాల్సిన పనిలేదు. ఒక్క హిట్ అమ్మడికి భారీ ఫాలోయింగ్ని తెచ్చిపెట్టింది. గాళ్స్ సహా కుర్రాళ్లలోనూ క్రేజీ బ్యూటీ మారిపోయింది. సోషల్ మీడియా ఫాలోవర్స్ ని మెరుగు పరుచుకుంది. హిందీలో అన్ని సినిమాల్లో నటించినా రాని గుర్తింపు ఒక్క తెలుగు సినిమాతో దక్కించుకోగల్గింది. మరి అంతగా ఫేమస్ అయిన హీరోయిన్ తెలుగులో నటిగా బిజీ అయిందా? కోటి రూపాయలు పారితోషికం డిమాండ్ చేసే సీన్ ఉన్నా? ఇంకా నత్తనడకనే సాగుతోందా? అంటే అవుననే తెలుస్తోంది. సీతారామం రిలీజ్ నాలుగు నెలలు గడుస్తున్నా ఇంత వరకూ కొత్త సినిమాకు సంతకం చేసింది. హిందీ లో మూడు సినిమాలు చేస్తున్నా..అవేమి భారీ సినిమాలు కావు. కెరీర్ ఆరంభం లాంటి ఛాన్సులే అవి. కానీ తెలుగు అంత గుర్తింపు వచ్చిన ఒక్క సినిమా కి కమిట్ కాకపోవడం అన్నది సీత అభిమానుల్ని కలవరపెడుతుంది. సన్నివేశం చూస్తుంటే కీర్తి సురేష్ తరహాలోనే పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగానే కనిపిస్తుంది. మహానటి తర్వాత కీర్తి సురేష్ ఏ రేంజ్ పాపులర్అయిందో చెప్పాల్సిన పనిలేదు. సౌత్ లో పిచ్చ ఫాలోయింగ్ దక్కించుకుంది. కానీ హీరోయిన్ గా ఎన్ని సినిమాలు చేసిందంటే? గట్టిగా చెప్పుకునే సినిమా 'సర్కారు వారి పాట' మినహా మరోటి కనిపించదు. కొన్ని లేడీ ఓరియేంటెడ్ ప్రయత్నాలు చేసి చేతులు కాల్చుకుంది. ఇప్పుడీ మృణాల్ పరిస్థితి అలాగే కనిపిస్తుంది. కొత్త సినిమాలు కావాలని చేయడం లేదా? లేక! సీత పాత్రలు లాంటివే కావాలని కూర్చుందా? లేడీ ఓరియేంటెడ్ చిత్రాలు కోసం వెయిట్ చేస్తుందా? అందుకే వచ్చిన అవకాశాల్ని సైతం వదులుకుంటుందా? అన్న సందేహాలు తెరపైకి వస్తున్నాయి. ఏదైనా క్రేజ్ ఉన్నంత కాలమే దున్నకునే అవకాశం . అది చేజారిన తర్వాత చేసేదేమి ఉండదు. ఇప్పటికే మృణాల్ పేరు జనాలు మర్చిపోయే పరిస్థితి ఏర్పడుతుంది.

## రెమ్యూనరేషన్ డబుల్ చేసిన సూపర్ హిట్ సినిమా హీరో



యంగ్ హీరో నిఖిల్ కార్తికేయ 2 సినిమా తో పాన్ ఇండియా స్థాయిలో భారీ వసూళ్లు దక్కించుకున్న విషయం తెల్సిందే. కెరీర్ లో బిగ్గెస్ట్ సక్సెస్ ను దక్కించుకున్న నిఖిల్ కెరీర్ స్పీడ్ అందుకుంది. కార్తికేయ 2 సినిమా సూపర్ హిట్ నేపథ్యంలో ఆయన నటించిన మరో సినిమా 18 పేజెస్ కి మంచి మార్కెట్ క్రియేట్ అయ్యింది. 18 పేజెస్ సినిమా భారీ గా ప్రీ రిలీజ్ బిజినెస్ చేయడంతో ముందు ముందు నిఖిల్ అన్ని సినిమాలు కూడా కచ్చితంగా భారీగా వసూళ్లు రాబట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నిఖిల్ తన పారితోషికంను పెంచాశాడు అంటూ ఇండస్ట్రీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. కార్తికేయ 2 కు ముందు వరకు నాలుగు నుండి అయిదు కోట్ల పారితోషికం ను నిఖిల్ అందుకునేవాడట. కానీ ఇప్పుడు ఆయన పారితోషికం దాదాపుగా రెట్టింపు అయ్యిందట. నిఖిల్ కొత్త సినిమాను కమిట్ అవ్వాలి అంటే ఏకంగా రూ. 8 కోట్ల రూపాయలు డిమాండ్ చేస్తున్నాడు అంటూ వార్తలు వస్తున్నాయి. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం ఇటీవల ఒక ప్రముఖ నిర్మాణ సంస్థ ఎనిమిది కోట్ల రూపాయలు ఇచ్చి మరీ నిఖిల్ తో సినిమాను చేసేందుకు ఒప్పందం కుదుర్చుందట. అందులో భాగంగా భారీ మొత్తంలో అడ్వాన్స్ ను కూడా ఇచ్చారనే వార్తలు వస్తున్నాయి. నిఖిల్ ప్రస్తుతం మంచి క్రేజ్ ఉన్న హీరో.. మంచి కథతో సినిమా తీయాలే కానీ పాన్ ఇండియా రేంజ్ లో మంచి వసూళ్లు రాబట్టగల సత్తా ఉన్న హీరో. అందుకే ఆయన పారితోషికం 8 కోట్లకు పెంచడం తప్పేం లేదు అన్నట్లుగా కొందరు నిర్మాతలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారట.

## బాబి ప్రామిస్ చేసినా...వీరయ్య ముందే దూకేసాడు!

రిలీజ్ కి ముందు 'గాడ్ ఫాదర్' ప్రచారం విషయంలో ఎలాంటి పరిస్థితులు తలెత్తాయో తెలిసిందే. రిలీజ్ దగ్గర పడుతోన్న యూనిట్ సరిగ్గా ప్రచార కారక్రమాలు నిర్వహించలేదని... ఏ ఈవెంట్ కూడా సరైన ప్రణాళికతో నిర్వహించలేదని....ఏకంగా సినిమా టీమ్ కే మీడియా సలహాలు ఇచ్చింది. ఈ విషయంలో మీడియాపై మెగాస్టార్ చిరంజీవి రియాక్షన్ సైతం అంతే సీరియస్ గానూ కనిపించింది. ప్రచారం ఎలా నిర్వహించాలో మీడియా వాళ్లు మాకు చెప్పాల్సిన పనిలేదని..మా సినిమా ఎలా ప్రచారం చేసుకోవాలో మాకు తెలియదా? అంటూ స్వీట్ గా రివర్స్ పంచ్ వేసేసారు. ఈ విషయంలో నెట్టింట కొంత చర్చ జరిగినప్పటికీ వాస్తవాలు గ్రహించి తగ్గాల్సిన వాళు వెనక్కి తగ్గడంతో వ్యవహారమంత సీరియస్ కాలేదు. తదుపరి



ఇలాంటి సమస్యలతు తలెత్తకుండా వాల్తేరు వీరయ్య ముందుగానే అలెర్ట అయ్యాడు. ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తోన్న బాబి ప్రచారం విషయంలో లీడ్ తీసుకుని ముందుకొచ్చినట్లు ప్రచారం సాగింది. చిరు అన్ని బాధ్యతలు బాబికే అప్పగించినట్లు వినిపించింది. పీఆర్ టీమ్ ఏం చేయాలన్నా ముందుగా బాబి అనుమతి తీసుకోవాల ని...అతని ప్లానింగ్ ప్రకారమే రిలీజ్ వరకూ అన్ని జరగాలని స్ట్రిక్ట్ ఆదేశాలిచ్చినట్లు వినిపిచింది. మరి అంతకన్నా ముందే వీరయ్య ప్రచార రంగంలోకి దూకేసారా? అంటే అవుననే చెబుతోంది తాజా సన్నివేశం. రిలీజ్ కి ఇంకా సరిగ్గా నెల రోజులు కూడా సమయం లేకపోవడంతో ముందే మేల్కోవడం మంచిదని భావించారో? ఏమో తాజాగా సోషల్ మీడియా వేదికగా వీరయ్య ప్రచారం షురూ చేసినట్లు కనిపిస్తుంది. నిన్నటి రాత్రి మెగాస్టార్ తన ఇన్స్టాగ్రామ్ పేజీ ద్వారా వాల్తేరు వీరయ్యలోని రెండవ పాట ట్యూన్ను లీక్ చేసారు. పాట మాత్రమే కాదు.. వాయిస్ ఓవర్తో కూడిన వీడియోను అప్లోడ్ చేశాడు. దీంతో వీరయ్య ప్రచారం చిరంజీవి లీక్ తోనే మొదలైనట్లు అభిమానులుభావిస్తున్నారు. బాబి ప్రామిస్ చేసినా.. ఈసారి చిరంజీవినే డైరెక్ట్ గా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆ వీడియో నెట్టింట వైరల్ గా మారింది. ఇప్పటికే వీరయ్య ప్రచార చిత్రాలు మెగా అభిమానుల్ని ఆకట్టుకుంటోన్న సంగతి తెలిసిందే. ఇకపై ట్రైలర్ రిలీజ్...ప్రీ రిలీజ్....ఇంటర్వ్యూలు అంటూ టీమ్ బిజీ కానుంది. యూరప్ షూట్ పూర్తికాగానే చిరంజీవి అండ్ కో ఆ పనుల్లోనే బిజీ కానున్నట్లు తెలుస్తోంది.

## శ్రుతిహాసన్ తో బాలయ్య డ్యూయెట్ అదిరిపోయింది!


నటసింహ నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ చిత్రం 'వీరసింహారెడ్డి'. మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత భారీ బడ్జెట్ తో నిర్మిస్తోంది. నటసింహ ఈ చిత్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మాస్ ట్రీట్ అందించబోతున్నారని చిత్రబృందం చెబుతోంది. మేకర్స్ సినిమాని జోరుగా ప్రమోట్ చేస్తున్నారు. ఇప్పటివరకూ పోస్టర్లు టీజర్ మొదటి పాటతో క్యూరియాసిటీని పెంచడంలో మలినేని బృందం పెద్ద సక్సెసైందనే చెప్పాలి. ఇప్పటికే మొదటి పాట జై బాలయ్యకు అద్భుతమైన స్పందన వచ్చింది. బాలయ్య అభిమానాల్ని ఆపాట విపరీతంగా ఆకట్టుకుంటుంది. తాజాగా కొద్ది సేపటి క్రితమే 'సుగుణ సుందరి' లిరికల్ సాంగ్ ని రిలీజ్ చేసారు. పాటలో బాలకృష్ణ ఏజ్ లెస్ లుక్ తో నవయువకుడిని తలపిస్తున్నారు. శృతి హాసన్ మల్టీ-కలర్ డ్రెస్ లో అందంగా కనిపిస్తోంది. యుగళగీతంలో లీడ్ పెయిర్ అద్భుత నృత్యాలతో అలరిస్తున్నారు. 'సీమా కుట్టిందే.. సిట్టి సీమా కుట్టిందే.. దిల్ కందిపోయే లా..ప్రేమా పుట్టిందే..పిచ్చి ప్రేమ పుట్టిందే' అంటూ సాగే పాట మాస్ లో దూసుకుపోవడం పక్కా. పాట ఆద్యంతం పరుగులు పెట్టిస్తుంది. బాలయ్య అభిమానులు పాటకు స్టెప్పులు అందుకోవాల్సిందే. ఎస్.ఎస్. థమన్ అందించిన ట్యూన్స్ శ్రోతల్ని ఆకట్టుకుంటున్నాయి. డ్యూయెట్ కేటగిరీలో పాట ఆకట్టుకుంటుంది. పాట కోసం ఎంపిక చేసుకున్న లోకేషన్స్ కలర్ ఫుల్ గా బాగున్నాయి. ఈ



పాటకి రామజోగయ్య శాస్త్రి లిరిక్స్ అందించగా.. రామ్ మిరియాల.. స్నిగ్ధ శర్మ ఆలపించారు. శేఖర్ మాస్టర్ కోరియోగ్రఫీ చేశారు. ఈ చిత్రంలో దునియా విజయ్- వరలక్ష్మి శరత్కుమార్ తదితరులు నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పై నవీన్ యెర్నేని- వై రవిశంకర్ లు ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా.. ప్రముఖ రచయిత సాయి మాధవ్ బుర్రా మాటలు అందించారు. అన్ని పనులుపూర్తిచేసిన ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు.

## ఓపెనింగుల్లో 'అవతార్ 2' ప్రకంపనాలు

జేమ్స్ కామెరూన్ 'అవతార్: ది వే ఆఫ్ వాటర్' 16 డిసెంబర్ 2022న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అవతార్ 2 భారతదేశంలో అత్యధికంగా ఓపెనింగ్స్ సాధించిన హాలీవుడ్ చిత్రంగా అవతరించిందనేది తాజా ట్రేడ్ రిపోర్ట్. ఇప్పటివరకూ భారతదేశంలో రిలీజైన అన్ని హాలీవుడ్ చిత్రాల రికార్డులను 'అవతార్ 2' తుత్తునియలు చేసింది. 'ది వే ఆఫ్ వాటర్' 2022లో మోస్ట్ అవైటెడ్ సినిమాల్లో ఒకటి. ఇది బిగ్ స్క్రీన్ పై మహదాద్భుత దృశ్యాలతో ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తుందని ఇప్పటికే విడుదలైన విజువల్స్ వెల్లడించాయి. ఈ చిత్రం 16 డిసెంబర్ 2022న పెద్ద స్క్రీన్ లపై అత్యంత భారీగా విడుదలవుతుండడంతో ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలేర్పడ్డాయి. అవతార్





2 ఇప్పుడు అంచనాలకు తగ్గకుండా అన్ని రికార్డులను బ్రేక్ చేస్తోంది. ముఖ్యంగా ఓపెనింగు రికార్డులన్నిటినీ ఇది తుడిచి పెట్టేసిందని ట్రేడ్ చెబుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఆడియెన్ ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తుండడంతో టికెట్ విండోస్ కిటకిటలాడుతున్నాయని ట్రేడ్ చెబుతోంది. ప్రేక్షకులు భారీ అంచనాలతో థియేటర్లకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ సీక్వెల్ కోసం ఇంకా వేచి ఉండలేని పరిస్థితి. కారణం ఏదైనా .. ప్రజల ఉత్కంఠ నడుమ రిలీజ్ కి సిద్ధమైన 'అవతార్ 2' భారతదేశంలోనే అత్యధిక ఓపెనింగ్స్ సాధించిన హాలీవుడ్ చిత్రంగా అవతరించనుంది. అవతార్ 2 పలు హాలీవుడ్ చిత్రాల ఓపెనింగుల రికార్డులను బ్రేక్ చేస్తోందని సమాచారం. ఇప్పటివరకూ ప్రపంచంలోనే అతి భారీ ఓపెనింగుల రికార్డుతో 'ఎవెంజర్స్: ఎండ్గేమ్ ఇన్ఫినిటీ వార్' స్థిరంగా ఉంది . కానీ ఈ రికార్డును అవతార్ 2 తుడిచి పెట్టేసిందని సమాచారం.

## నిర్మాతగా దిల్ రాజు కోరిక ఏంటో తెలుసా?

టాలీవుడ్ లో వున్న స్టార్ ప్రొడ్యూసర్ లలో దిల్ రాజు శైలి ప్రత్యేకం. ఆటోమోబైల్ రంగం నుంచి డిస్ట్రిబ్యూటర్ గా ప్రయాణం మొదలు పెట్టిన ఆయన ఆ తరువాత నైజాంలో తిరుగులేని డిస్ట్రిబ్యూటర్ గా పేరు తెచ్చుకున్నారు. అదే తరమాలో నిర్మాతగానూ టాలీవుడ్ స్టార్ లతో సినిమాలు చేసిన స్టార్ ప్రొడ్యూసర్ అనిపించుకున్నారు. ప్రస్తుతం తమిళ హీరో విజయ్ తో 'వారీసు'ని నిర్మిస్తున్నారు. ఈ మూవీని తెలుగులో 'వారసుడు'గా రిలీజ్ చేయబోతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఓ మీడియాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాల్ని దిల్ రాజు వెల్లడించారు. ప్రొడ్యూసర్స్ గిల్డ్ తో పాటు ఇండస్ట్రీలో నిర్మాతల సమస్యలతో పాటు పలు కీలక అంశాలపై స్పందించారు. బడ్జెట్ గురించి మాట్లాడుతూ వెయ్యి కోట్లలో ప్రొడ్యూసర్ చేతికి వచ్చేది ఎంత అనే విషయం గురించి ఎవరూ మాట్లాడరని నిజం మాట్లాడుకుంటే చాలా స్పష్టత వస్తుందన్నారు. పెద్ద సినిమా తెలుగులో రూ. 200 కోట్ల గ్రాస్ వసూలు చేస్తే 18 శాతం



జీఎస్టీ 36 కోట్లు పోతాయని దీని గురించి ఎవ్వరూ మాట్లాడరన్నారు. ఇక థియేట్రికల్ రెంటల్స్ రూపంలో 25% 50 కోట్లు పోతే 200 కోట్లలో 110 కోట్లే డిస్ట్రిబ్యూటర్ చేతికొస్తాయన్నారు. ఇక క్యారవాన్ ల గురించి మాట్లాడుతూ అవి లేకుండా షూటింగ్ లేదు.




Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printed & published at Unyted Publications, From H.no: #50-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India.
Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com